Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 314 మేడ్చల్ మల్కాజ్‌గిరి 2 డిసెంబర్ 2023 శనివారం పేజీలు : 4

## ఎప్పటిలోగా తేలుస్తారో చెప్పండి?

### మహారాష్ట్ర స్పీకర్‌కు సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ : ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై ఎప్పటిలోగా నిర్ణయం తీసుకుంటారో చెప్పాలని మహారాష్ట్ర స్పీకర్ రాహుల్ నర్వేకర్‌ను సుప్రీం కోర్టు కోరింది. స్పీకర్ నిర్ణయంలో జాప్యంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ఇదే ఆఖరి అవకాశమని, కచ్చితమైన సమయం నిర్దేశించాలని సూచించింది. వేగంగా తీర్పు ఇవ్వాలని పేర్కొంది. శివసేన చీలిపోయిన అనంతరం.. ప్రత్యర్థి శిబిరంలోని ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ శిందే వర్గం, మాజీ సీఎం ఉద్ధవ్ వర్గం స్పీకర్‌ను ఆశ్రయించాయి. అనంతరం సుప్రీం కోర్టులోనూ పిటిషన్లు దాఖలు చేశాయి. వీటిపై సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ సారథ్యంలోని ధర్మాసనం మరోసారి విచారణ చేపట్టింది.

# బెట్టింగ్ బంగార్రాజులు వచ్చారోచ్

హైదరాబాద్: తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలకు పోలింగ్ ముగిసింది. ఇక, ఎన్నికల ఫలితాలపై ఎగ్జిట్‌పోల్స్ సైతం ఆసక్తికర ఫలితాలను వెల్లడించాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో అధికారం ఎవరిది అనే ఉత్కంఠ నెలకొంది. మరోవైపు.. కొందరు నేతలు మాత్రమ ఎగ్జిట్‌పోల్స్ ఫైనల్ కాదు.. విజయం తమదంటే తమదే అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. తెలంగాణ రాజకీయాలు, ఎన్నికలపై ఏపీలో జోరుగా బెట్టింగ్ జరుగుతోంది. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ ఖచ్చితంగా హ్యాట్రిక్ కొడుతుందని కొందరు.. లేదు.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని మరికొందరు జోరుగా పందాలు కాస్తున్నారు. వందల కోట్లతో తెలంగాణ ఫలితాలపై పందాలు కాస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో కోట్ల రూపాయల నగదు చేతులు మారుతున్నట్లు సమాచారం.. మరోవైపు.. రెండు సెగ్మెంట్లలో పోటీ చేస్తున్న సీఎం కేసీఆర్‌కు ముఖ్యంగా గజ్వేల్‌లో ఎంత మెజార్టీ వస్తుందని కూడా బెట్టింగ్ రాయుళ్లు బెట్టింగ్ ఖాస్తున్నట్లు సమాచారం.

అదేవిధంగా సిద్దిపేటలో ఈసారి మంత్రికి హరీశ్ రావుకి గతం కంటే ఎక్కువ వస్తుందా? లేదా తగ్గుతుందా అంటూ బెట్టింగ్ జరుగుతోంది. మరోవైపు కామారెడ్డిలో కేసీఆర్ ఓడిపోతారా? లేదా గెలుస్తారా? అని కూడా తెలంగాణ, ఏపీలో భారీగా బెట్టింగ్ జరుగుతున్నట్లు సమాచారం.

ప్రధానంగా ఖమ్మ?ంలో కాంగ్రెస్ క్లీన్‌స్వీప్ చేస్తుందంటూ మరో బెట్టింగ్ నడుస్తోంది. అలాగే, బీజేపీ ఎన్ని స్థానాలు గెలుస్తుంది.




ఏయే స్థానాల్లో గెలుస్తుందని కోట్లలో బెట్టింగ్ నడుస్తున్నట్టు వార్తలు చక్కర్లు కొడుతున్నాయి.

**కౌంటింగ్‌కు సర్వం సిద్ధం.. ఈసారి ఉల్లంఘన కేసులు ఎన్నంటే?...** తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఇక, ఓట్ల లెక్కింపు ఈనెల మూడో తేదీన(ఆదివారం) జరగనుంది. ఈ నేపథ్యంలో కౌంటింగ్ కోసం ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తున్నారు. దీంతో, ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. నలభై కంపెనీల బలగాలతో పటిష్ట భద్రతను ఏర్పాటు చేసినట్టు అధికారులు తెలిపారు. అలాగే, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు

## కేసీఆర్ గెలుస్తారు.. లేదు వాళ్లదే విజయం..

## చేతులు మారుతున్న కోట్ల డబ్బు!

చేశారు. కౌంటింగ్ కేంద్రాల్లో 1,766 లెక్కింపు టేబుళ్లు ప్లాన్ చేశారు. కౌంటింగ్ కేంద్రాల్లో 131 పోస్టల్ బ్యాలెట్ టేబుళ్లను ఏర్పాటు చేయగా.. ఆరు నియోజకవర్గాల్లో 500కు పైగా పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఆదివారం ఉదయం ఎనిమిది గంటలకు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ఉంటుందని అధికారులు వెల్లడించారు.

అలాగే, ఉదయం 10 గంటలకు మొదటి ఫలితం వెల్లడవుతుందన్న ఈసీ పేర్కొంది. ప్రతీ టేబుల్‌పై మైక్రో అబ్జర్వర్.. కౌంటింగ్ సూపర్ వైజర్.. ఇద్దరు అసిస్టెంట్లు ఉంటారు. ఇక, ఎన్నికల నిబంధనలపై 2023లో 13 వేల కేసులు నమోదైనట్టు ఎన్నికల అధికారులు తెలిపారు. ఇక, 2018 ఎన్నికల్లో నిబంధనల ఉల్లంఘనలపై 2,400 కేసులు అయినట్టు స్పష్టం చేశారు.

## అన్ని ప్రభుత్వ లావాదేవీలపై నిఘా పెట్టాలి: రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: ఓటమి భయంతో సీఎం కేసీఆర్ రైతు బంధు నిధులను.. ఇతర కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపునకు మళ్లిస్తున్నారని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆరోపించారు.

దీనిపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్‌ను కలిసి ఫిర్యాదు చేయనున్నట్టు చెప్పారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో



మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడిన రేవంత్.. హైదరాబాద్ చుట్టు పక్కల ఉన్న అసైన్డ్ భూములను ఇతరుల పేర్ల మీద రిజిస్ట్రేషన్ చేసే ప్రక్రియ జరుగుతోందని వివరించారు. ప్రభుత్వ అన్ని లావాదేవీలపై విజిలెన్స్ విభాగం నిఘా పెట్టాలని కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాలకు ఫిర్యాదు చేస్తామని వెల్లడించారు.

## టీయారెస్ నుంచి బీయారెస్ కి మారడమే కొంప ముంచిందా?

పేరులో ఏముంది అని అంటారు. కానీ చాలానే ఉంది. కొన్ని పేర్లు సెంటిమెంట్ గా ఉంటాయి. కొన్ని లక్కీ జాక్ పాట్ గా పనిచేస్తాయి. జనాలకు మరి కొన్ని పేర్లు ఎమోషనల్ గా కనెక్ట్ అవుతాయి. అలా తీసుకుంటే కనుక టీయారెస్ అన్నది తెలంగాణా ఆత్మగా ఉన్న పేరు. తెలంగాణా పేరుతో ఉన్నపుడు టీయారెస్ కి అన్నీ భారీ విజయాలే దక్కాయని చెప్పాలి. అసలు తెలంగాణా ఉద్యమం స్టార్ట్ చేసి కనీ వినీ ఎరగని తీరులో దాన్ని కొనసాగించి అసాధ్యం అనుకున్న తెలంగాణాను సుసాధ్యం చేసింది టీయారెస్. మరి అలాంటి ఉద్యమ నినాదం లాంటి పేరుని కాస్తా బీయారెస్ గా మార్చి తెలంగాణా పేరుని తీసివేయడం వల్ల ఇబ్బందులు ఎదురయ్యాయా అన్న చర్చ అయితే ఇపుడు తెలంగాణా అంతటా సాగుతోంది. తెలంగాణాలో పోలింగ్ ముగిసింది. ఫలితాలకు టైం ఉంది. ఎగ్జిట్ పోల్స్ మాత్రం ముందే ఊహించి చెప్పిన మాటలు ఇచ్చిన నివేదికలు చూస్తే తెలంగాణాలో అధికారంలో ఉన్న బీయారెస్ ని తెగ కలవరపెడుతున్నాయి. ఎందుకంటే దాదాపుగా అన్ని సర్వేలూ కాంగ్రెస్ కే ఎడ్జ్ ఇచ్చాయి. అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ మాత్రమే అని కచ్చితంగా చెప్పేశాయి. దాంతోనే ఇపుడు బీయారెస్ లో అంతర్మథనం సాగుతోంది అని అంటున్నారు. ఇక దీంతోనే అనేక రకాలైన చర్చలు కూడా మొదలయ్యాయి. రాజకీయ విశ్లేషకులు అయితే టీయారెస్ ని కాస్తా బీయారెస్ గా మార్చిన మీదటనే ఇపుడు కష్టాలు ఎదురయ్యాయని అంటున్నారు. పార్టీ పేరులో తెలంగాణా అన్నది లేకపోవడం వల్లనే ఇపుడు ఇలా అయింది అని అంటున్న వారూ ఉ




న్నారు. ఇక బీయారెస్ గా గత ఏడాది విజయదశమి వేళ కేసీయార్ పేరు మార్చారు. అయితే ఆనాడు మద్దతుగా నిలిచిన వారు అయితే ఈ రోజు ఎవరూ లేరు. కర్నాటక నుంచి వచ్చిన మాజీ సీఎం కుమారస్వామి అయితే ఇపుడు బీజేపీతో పొత్తులో ఉన్నారు. అలాగే నాడు వచ్చిన చాలా మంది నేతలు కూడా కనిపించడంలేదు. ఇంకో వైపు చూస్తే టీయారెస్ అస్థిత్వం ఆత్మ అన్నీ కూడా తెలంగాణాలో పెట్టుకుని ఆ పేరుని కాస్తా చెరిపేసి కీలక సమయాల్లో కేసీయార్ దేశాటనం చేయడం కూడా కచ్చితంగా దెబ్బ తీసింది అని అంటున్నారు. కేసీయార్ మహారాష్ట్ర వెళ్లారు, పంజాబ్ వెళ్లారు, అక్కడ రైతులకు డబ్బులు ఇచ్చారు. బీహార్ కి వెళ్లారు. ఇలా దేశాన్ని పట్టుకుని తిరిగిన కేసీయార్ అతి ధీమాతో వ్యవహరించారు అన్న విమర్శలు ఇపుడు వస్తున్నాయి. తెలంగాణా రాష్ట్రాన్ని ఆయన పట్టించుకోలేదని రాజకీయ సమీకరణలు మారినా గెలుస్తామన్న మొండి ధైర్యంతో ముందుకు పోవడం ఇక ముందు జాతీయ రాజకీయమే అని కూడా నేల విడిచి సాము చేయడం వల్లనే ఇపుడు ఇలాంటి పరిస్థితులు వచ్చాయా అన్నదే చర్చగా ఉంది. ఇలా తెలంగాణాను కాదనుకుని దేశం వైపు చూడడం కేసీయార్ జాతీయ రాజకీయాల మమకారాన్ని తెలియచేసినా ఉన్న చోట బలమున్న చోట మాత్రం దెబ్బ పడింది అని అంటున్నారు. దీనిని కాస్తా వెనక్కి వెళ్ళి ఎన్టీయార్ నేషనల్ ఫ్రంట్ నాటి అనుభవాన్ని కూడా గుర్తుకు తెస్తున్నారు. ఆనాడు ఉమ్మడి ఏపీకి తెలుగుదేశం తరపున ముఖ్యమంత్రి అయిన ఎన్టీయార్ కీలక సమయంలో నేషనల్ ఫ్రంట్ చైర్మన్ అంటూ జాతీయ రాజకీయాలు నడిపారు. చివరికి 1989లో జరిగిన ఎన్నికల్లో ఆయన ఓటమి పాలు అయ్యారు. తెలుగుదేశం దారుణంగా పరాజయం పాలు కావడమే కాకుండా ఎన్టీయార్ కల్వకుర్తిలో స్వయంగా ఓటమి పాలు అయ్యారు. ఎమోషనల్ పాలిటిక్స్ కి పెట్టింది పేరు అయిన ఎంటీయార్ కి అది తొలి చివరి ఓటమి, ఆయన రాజకీయ జీవితంలో మాయని మచ్చ. మరి కేసీయార్ రాజకీయం ఎమోషనల్ ప్లస్ వ్యూహాత్మకంగా సాగుతుంది.అయినా కూడా ఆయన పెట్టిన పార్టీలో ఎమోషన్ని టచ్ చేసే తెలంగాణా అనేది మాత్రం లేదు అదే చివరికి దెబ్బ కొట్టింది అని అంటున్నారు. ఏది ఏమైనా అసలు ఫలితాలు వస్తే బీయారెస్ పేరు హిట్టో ఫట్టో తేలుతుంది అని అంటున్నారు.

## అయిదు రాష్ట్రాలలో పుంజుకుంటున్న కాంగ్రెస్

# గెలుపు పక్కా



## నిగ్గు తేల్చిన టైమ్స్ ఆఫ్ ఇండియా!!

దేశంలో జరిగిన అయిదు రాష్ట్రాల ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుంది అని టైమ్స్ ఆఫ్ ఇండియా గట్టిగా చెబుతోంది. ఈ మేరకు తన దగ్గర ఉన్న అంచనాలను బయటపెడుతోంది. 2018లో జరిగిన ఎన్నికల్లో ఈ అయిదు రాష్ట్రాలలో కాంగ్రెస్ ఎక్కువ సీట్లను ఓట్లను గెలుచుకుంది అని గుర్తు చేస్తోంది. అప్పటికీ ఇప్పటికీ మారిన పరిస్థితుల నేపథ్యం నుంచి చూసుకున్నపుడు మరోసారి కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందని కూడా ధీమాగా చెబుతోంది.

రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తెస్ ఘడ్ లలో మొత్తం అసెంబ్లీ సీట్లు 520 ఉన్నాయని, ఇందులో నుంచి 2018లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ 282 సీట్లను గెలుచుకుంది అని టైమ్స్ ఆఫ్ ఇండియా చెబుతోంది. అలా గెలుపు శాతం తీసుకుంటే 54.2 ఉందని అంటోని. దక్షిణాదిన ఉన్న తెలంగాణాతో పాటు మిజోరామ్ కలుపుకుని మొత్తం చూస్తే 683 సీట్లు అవుతాయి. ఇందులో 2018లో కాంగ్రెస్ గెలుచుకున్న సీట్లు 305గా ఉన్నాయి. బీజేపీ ఇందులో 199 సీట్లను మాత్రమే గెలుచుకుంది. అంటే ఈ రెండు పార్టీల మధ్య వ్యత్యాసం చాలానే ఉంది అని టైమ్స్ ఆఫ్ ఇండియా చెబుతోంది. ఇపుడు పరిస్థితి ఈ అయిదు రాష్ట్రాలలో కాంగ్రెస్ కి బాగా మారింది అని అంటోంది. గతానికి కంటే మంచి పెర్ఫార్మెన్స్ కాంగ్రెస్ చేయనుంది అని అంటోంది. అందువల్ల కచ్చితంగా ఈ అయిదు రాష్ట్రాలలో కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుంది అని టైమ్స్ ఆఫ్ ఇండియా తన అంచనాను బయటకు తెచ్చింది.

టైమ్స్ ఆఫ్ ఇండియా అంచనా మేరకు ఈ అయిదు రాష్ట్రాలలో బీజేపీ గట్టిగా పోరాడాల్సి ఉంటోంది అని అంటున్నారు. మధ్యప్రదేశ్ లో బీజేపీ కంటే కాంగ్రెస్ కే ఎక్కువ సీట్లు వస్తాయని పలు సర్వేలు ఇప్పటికే చెప్పేసాయి. రాజస్థాన్ లో కాంగ్రెస్ మరోసారి అధికారాన్ని నిలబెట్టుకోవడానికి హోరా హోరీ పోరు సాగించింది. చత్తీస్ ఘడ్ లో బీజేపీకి మళ్లీ ఓటమి తప్పదని తేలుతోంది. తెలంగాణాలో చూస్తే బీయారెస్ కాంగ్రెస్ ల మధ్యనే పోరు సాగుతోంది. బీజేపీ అక్కడ మూడవ ప్లేస్ కే పరిమితం కానుంది.

కాంగ్రెస్ బాగా పుంజుకుని అధికారాన్ని చేజిక్కించుకోవడం ఖాయమని, మిజోరాం లో కాంగ్రెస్ కి బలం ఉంది, ప్రాంతీయ పార్టీ మిజో నేషన్ల్ ఫ్రంట్ తో పోటీ పడుతోంది. ఈ దఫా ఓటర్లు కాంగ్రెస్ కి పట్టం కట్టవచ్చు అన్న అంచనాలు కనిపిస్తున్నాయి. అలా చూసుకుంటే ఈ అయిదు రాష్ట్రాలలో హస్తవాసి బాగానే ఉంటుంది అని అంటున్నారు. రాహుల్ గాంధీ కూడా అదే ధీమాను వ్యక్తం చేస్తున్నారు. మేము గెలిచి తీరుతాం చూడండి అని ఆయన అంటున్నారు. డిసెంబర్ 3న ఫలితాలు వస్తాయి. అవి దేశ రాజకీయ ముఖ చిత్రాన్ని మార్చనున్నాయని అంటున్నారు.

# సంపాదకీయం

## చైనాను వణికిస్తున్న కొత్త సమస్య

డ్రాగన్ దేశాన్ని ఏదో ఒక ఉపద్రవం వెంటాడుతునే ఉంది. కరోనా వైరస్ ను ప్రపంచం మీదకు వదిలిన పాపం ఇప్పుడిప్పుడే చైనాను వదిలిపెట్టేట్టు లేదు. తాజాగా న్యుమోనియా రూపంలో అంతుచిక్కని వైరస్ జనాల మీద దాడిచేస్తోంది. మామూలుగా న్యుమోనియా అంటే పెద్దగా భయపడాల్సిన అవసరంలేదు. డాక్టర్ల పర్యవేక్షణలో సరైన మందులువాడితే కొద్దిరోజుల్లోనే నయమైపోతుంది. కాని ఇపుడు న్యుమోనియా లక్షణాలతో కనబడుతున్న కొత్త సమస్య జనాలను ఎంతకీ వదలటంలేదు. జనాలు ఎంతమంది డాక్టర్లకు చూపించుకున్నా, ఎన్ని మందులు వాడుతున్నా ఉపసమనం దక్కటంలేదు. చైనాలోని చాలా ప్రావిన్సుల్లోని విద్యా సంస్థల్లోని చిన్నారులపైన తీవ్ర ప్రభావం చూపిస్తోంది. పిల్లలు అస్వస్థతతో ఇబ్బందులు పడుతు ఆసుపత్రులకు చేరుకుంటున్నారు. ఎన్నిరోజులు ఆసుపత్రుల్లో ఉంచి వైద్యం అందిస్తున్నా సమస్య పరిష్కారం కావటంలేదు. బీజింగ్, లియానింగ్, డ్యాంగ్జూ లాంటి ప్రావిన్సుల్లో ఈ ప్రమాదకర న్యుమోనియా సమస్య ఎక్కువగా కనబడుతోంది. కోవిడ్ మహమ్మారి సమస్య ప్రారంభదశలో ఎలాగైతే విరుచుకుపడిందో సేమ్ టు సేమ్ ఇపుడు అలాంటి పరిస్థితుల్లో ప్రావిన్సుల్లోను, ఆసుప్రతుల్లోను కనబడుతోంది. కొత్త సమస్య ప్రధానంగా లంగ్స్ మీద తీవ్రమైన ప్రభావం చూపుతుండటంతో పిల్లల్లో శ్వాసకోశ సమస్యలు పెరిగిపోతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ఉష్ణోగ్రతలు ఎక్కడైతే తీవ్రంగా పడిపోయి చలి విపరీతంగా పెరిగిపోతోంది అలాంటి ప్రావిన్సుల్లోనే ఇలాంటి మిస్టరీ న్యుమోనియా సమస్యలు పెరిగిపోతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. అయితే దీనికి విరుగుడు మాత్రం డాక్టర్లు, వైద్య నిపుణులు చెప్పలేకపోతున్నారు. లంగ్ ఇన్ఫెక్షన్ పెరిగిపోతున్న కారణంగా చిన్నపిల్లలు తట్టుకోలేకపోతున్నారు. అందుకనే వాళ్ళని తల్లి, దండ్రులు వెంటనే ఆసుపత్రుల్లో చేర్చేస్తున్నారు. దీనివల్ల పై ప్రావిన్సుల్లోని ఆసుపత్రులు ఎక్కువగా చిన్నపిల్లల అడ్మిషన్లతో నిండిపోతోంది. ఇదే విషయమై ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ ఓ) కూడా వెంటనే అప్రమత్తమైంది. ఇతర దేశాల్లోని వైద్య నిపుణులను చైనాకు పంపటానికి ఏర్పాట్లు చేస్తోంది. పిల్లల్లోని అనారోగ్య లక్షణాలను, రక్తపరీక్షల రిపోర్టులను వెంటనే తమకు పంపాలని డబ్ల్యూహెచ్ఓ చైనా ప్రభుత్వాన్ని ఆదేశించింది. అయితే డబ్ల్యూహెచ్ఓ ఆదేశాలను చైనా ప్రభుత్వం ఎంతవరకు ఆచరిస్తుందో చూడాల్సిందే. మొత్తానికి కరోనా వైరస్ తర్వాత చైనాను ఏదో ఒక వైరస్ ఇబ్బందులు పెడుతున్నది అయితే వాస్తవం.

# ఓట్ల లేకింపు సాఫీగా, సాగేందుకు తగిన చర్యలు....

### కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలించినరాచకొండ పోలీస్ కమీషనర్, జిల్లా ఎన్నికల పరిశీలకులు, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్





గరుడ వార్త మేడ్చల్ జిల్లా బ్యూరో : స్ట్రాంగ్ రూమ్ కు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయడంతో పాటుగా, ఈనెల 3న జరగబోయే ఓట్ల లెక్కింపుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లుగా జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ గౌతం పేర్కొన్నారు. జిల్లాలోని ఐదు శాసనసభ నియోజకవర్గాల పరిధిలో ప్రశాంత వాతావరణంలో సాఫీగా పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం, కట్టుదిట్టమైన భద్రత నడుమ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను ఓట్ల లెక్కింపు కేంద్రాలలోని స్ట్రాంగ్ రూమ్ లకు చేర్చారు. శనిరవరం రాచకొండ పోలీస్ కమీషనర్ డి ఎస్ .చౌహన్ ,జిల్లా పరిశీలకులు ఎస్.కె.జైన్, పూర్వా గార్గ్, అమన్ మిట్టల్ తో కలిసి మేడ్చల్ %--% మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్, కీసరలోని బోగారం హెూలీమేరి ఇంజనీరింగ్ కాలేజీలో కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించినారు. ఈ సందర్భంగా శుక్రవారం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... డిసెంబర్ 3వ తేదీన తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ నిర్వహించడం జరుగనున్న నేపద్యంలో, ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందిని అందు కొరకు చేపటిన ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలిస్తూ, అధికారులకు పలు సూచనలు చేశారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్ ల వద్ద ఏర్పాటు చేసిన సిసి కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షణ జరపాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలో ఓట్ల లెక్కింపు విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది రాకపోకలకు, అభ్యర్థులు, ఏజెంట్ల రాకపోకల కోసం వేర్వేరు మార్గాలతో ఏర్పాటు చేసిన బారికేడ్లను పరిశీలించారు. తాగునీరు, విద్యుత్ సరఫరా, కౌంటింగ్ టేబుల్స్, ఇతర అన్ని ఏర్పాట్లను నిశితంగా పరిశీలన జరిపారు. కౌంటింగ్ ప్రక్రియ కు ఎలాంటి ఇబ్బందులకు తావులేకుండా సాఫీగా జరిగేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, డీసీపీ జానకి, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల సిబ్బంది తదితరులు ఉన్నారు.

# మట్టి.. కొల్లగొట్టి



కొణిజర్ల : నీటి పారుదల శాఖ అధికారుల నిర్లక్ష్యం.. జేసీబీ యజమానులు, మట్టి వ్యాపారులకు వరంగా మారింది. సాగర్ ఎడమ కాల్వ పక్కనున్న మట్టి వ్యాపారులకు కాసుల వర్షం కురిపిస్తోంది. కాల్వ తవ్వినపుడు మట్టిని దానిపక్కన పెద్దపెద్ద గుట్టల్లా పోశారు. రూ.కోట్లు విలువ చేసే ఆ మట్టి గుట్టలు ప్రస్తుతం కరిగిపోతుతున్నాయి. ప్రస్తుతం మట్టి, గ్రావెల్‌కు డిమాండ్ ఎక్కువ ఉంది. వేసవిలో పొలాలు చదును చేసుకునేవారు, రియల్ వెంచర్లలో రోడ్లు, ఇతరత్రా చదును చేసే పనులకు మట్టి అధికంగా అవసరం ఉంటుంది. వెంకటాయపాలెం, తనికెళ్ల, రామనర్సయ్యనగర్, విక్రంనగర్, ఉప్పలచెలక, ఏన్కూరు మండలం తిమ్మారావుపేట, ఏన్కూరు, తల్లాడ, కల్లూరు, ఇలా కాల్వ ఉన్న ప్రతి మండలంలో మట్టి వ్యాపారం జోరుగా సాగుతోంది. వారం రోజులుగా విక్రంనగర్, ఉప్పలచెలక దగ్గర ఉన్న గద్దలగూడెం మేజర్ వద్ద జేసీబీలతో మట్టిని గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే అధికారుల నుంచి అనుమతి తీసుకున్నామనే సాకులు చెబుతూ మట్టి దందాను కొనసాగిస్తున్నారు. ట్రాక్టర్ మట్టికి రూ.1,500 నుంచి రూ.2 వేల వరకు వసూలు చేస్తున్నారు. బోడియాతండా, గుబ్బగుర్తి, ఏన్కూరు, తల్లాడ, కల్లూరు మండలాలకు చెందిన కొందరు వ్యాపారులు ఇదే పనిగా పెట్టుకుని కాల్వ మట్టిని తరలిస్తున్నారు.

నిబంధనలను పక్కనపెట్టి..

మట్టిని వినియోగించుకోవాలంటే జలవనరుల శాఖ అధికారులకు సంబంధిత ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకుంటే వాటిని పరిశీలించి నిబంధనల ప్రకారం మట్టి తరలించడానికి అనుమతి ఇస్తారు. అది కూడా రైతులకు మాత్రమే వీలుంటుంది. ఇక్కడ రైతుల పేరుతో వ్యాపారులు మట్టి దందాను కొనసాగిస్తున్నారు. ఉన్నతాధికారులు కాలువపై ప్రయాణం చేస్తే ఎంత మట్టి బయటకు తరలిపోయిందో స్పష్టంగా అర్థమవుతుంది. ఈ విషయంపై స్థానిక రైతులు అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకునే పరిస్థితి లేదు. మట్టి తరలిస్తున్నారనే సమాచారాన్ని రాత్రిపూట చెబితే ఆ సమయంలో ఎలా వస్తామంటరూ.. పగటి వేళ చెబితే అంతా దూరం ఎలా రావాలంటూ అధికారులు తప్పించుకుంటున్నారనే వాదనలున్నాయి.. విలువైన కాలువ మట్టిని కాపాడుకునే పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పటికే 70 శాతం వరకు మట్టిని బయటకు తరలించారు. ఉన్న మట్టిని కాపాడుకోకపోతే మేజర్లు, మైనర్లు, ఇతర కాలువలకు గండ్లు పడినపుడు వాడుకోవడానికి మట్టి దొరకడం కష్టమే. ఇప్పటికైనా ఉన్నతాధికారులు మట్టి వ్యాపారంపై దృష్టి సారిస్తే భవిష్యత్తు అవసరాలకు ఉపయోగపడుతుంది.

మా దృష్టికి రాలేదు: అబీద్, ఎన్నెస్పీ, ఏఈ

గద్దలగూడెం మేజర్ వద్ద మట్టి తోలకాలు మా దృష్టికి రాలేదు. సాగర్ ప్రధాన కాలువ పక్కన కాబట్టి మానిటరింగ్ అధికారులు చూస్తారు. మాకు సంబంధం లేదు. వారి దృష్టికి తీసుకువెళ్తాను.

# చేపల వంటకాలు భలే.. భలే!

ఖమ్మం : తెలంగాణ రాష్ట్రావతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా మత్స్యశాఖ ఆధ్వర్యంలో భద్రాద్రి జిల్లాలో (జూన్ 6, 7, 8), ఖమ్మం జిల్లాలో (జూన్ 8, 9, 10) చేపల ఆహార దినోత్సవం (ఫిష్ ఫుడ్ ఫెస్టివల్) నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అవసరమైన స్టాల్స్ ఏర్పాటుకు అధికారులు యత్నిస్తున్నారు. చేపలు, రొయ్యలతో నోరూరించే వంటకాలను అందుబాటులో ఉంచనున్నారు.

శిక్షణ పొందిన సభ్యులతో...

మహిళా మత్స్య సహకార సంఘాలకు చెందిన 27 మందికి గత ఫిబ్రవరిలో ఖమ్మంలోని టీటీడీసీలో ‘సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్రెష్ వాటర్ ఆక్వా కల్చర్- విశాఖపట్నం’ ఆధ్వర్యంలో చేపల వంటకాలపై శిక్షణ ఇచ్చారు. తర్ఫీదు పొందిన వారికి రూ.50వేల విలువైన వంటల తయారీ పరికరాలను ఉచితంగా అందించారు. మరో 21 మందికి హైదరాబాద్‌లో చేపల వంటకాలపై ఇటీవల శిక్షణ ఇచ్చారు. తర్ఫీదు పొందిన వారితోనే ఫుడ్ ఫెస్టివల్‌ను అధికారులు నిర్వహిస్తారు. వివిధ రకాల రుచికరమైన వంటకాలను తయారుచేయటం ద్వారా వినియోగదారులను ఆకర్షిస్తారు. మత్స్య సహకార సంఘాల సభ్యులు మొబైల్ ఫిష్ ఔట్‌లెట్ నిర్వహించుకునేందుకు తోడ్పాటునందిస్తారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా మత్స్య సహకార సంఘాలు బలోపేతమవుతాయని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

చేపలు మంచి పోషకాహారం. వీటిని ఏరూపంలో తీసుకున్నా ఆరోగ్యానికి మేలు. చాలామందికి చేపల వంటకాలపై అవగాహన లేదు. అందుకే ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాన్ని అమలుచేయాలని నిర్ణయించింది. చేపల వినియోగాన్ని పెంచటమే కార్యక్రమం ఉద్దేశం. ఫుడ్ ఫెస్టివల్ విజయవంతానికి ఏర్పాట్లు మొదలయ్యాయి. పది స్టాళ్లను నెలకొల్పుతున్నాం.

చేపల పచ్చళ్లు కొర్రమీను పచ్చళ్లు ఫిష్ బర్గర్స్ ఫిష్ సమోసా

# పత్తి విత్తనాలపై కంపెనీల పెత్తనం

ఖమ్మం : ఈ సంవత్సరం కంపెనీలు వివిధ రకాల పత్తి విత్తనాల ధరలు పెంచి రైతుల నడ్డి విరుస్తున్నాయి. బీటీ-2 రకం పత్తి విత్తనాల ప్యాకెట్ ధర గతేడాది రూ.810 ఉండగా ఈసంవత్సరం రూ.853గా కంపెనీలు ధర నిర్ణయించాయి. ప్యాకెట్‌కు రూ.43 చొప్పున పెంచాయి. దీనివల్ల విత్తనాల రూపంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల రైతులపై సుమారు రూ.4 కోట్లకు పైగా అదనపు భారం పడుతోంది. పెట్టుబడులు పెరిగి..ఇప్పటికే పెట్టుబడులు భారీగా పెరిగి సేద్యం చేయలేని రైతులకు ఇది పిడుగులాంటి వార్తే. కంపెనీల నిర్ణయం రైతులకు నష్టం కలిగిస్తుంది. ఏటా వానాకాలం సీజన్‌లో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో సుమారు 4.80 లక్షల ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేస్తారు. ఉభయ జిల్లాల్లో అత్యధికంగా సాగు చేసే వాణిజ్య పంట ఇదే కావటం విశేషం. ఒకవైపు పత్తికి ఆశించిన స్థాయిలో మద్దతు ధర లభించకపోవటం, సరైన దిగుబడులు రాకపోవటం, ఎగుమతులు లేక ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. మరోవైపు ట్రాక్టర్లు, డీజిల్, ఎరువులు, కూలీల ధరలు విపరీతంగా పెరిగాయి. తాజాగా పత్తి విత్తనాల ధర పెంచుతూ కంపెనీలు నిర్ణయం తీసుకోవటం మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టు రైతుల పరిస్థితి తయారైంది.

ధర లేక దిగాలుక్వింటా పత్తికి కనీసం రూ.9వేల పైన ధర పలికితేనే రైతుకు కొంతవరకు గిట్టుబాటు అయ్యే అవకాశముంది.

# మణుగూరుకు కొత్తరూపు

మణుగూరు : మణుగూరు పట్టణం రూపురేఖలు మరోసారి మారనున్నాయి. సింగరేణి బొగ్గు గనులు, భద్రాద్రి థర్మల్ విద్యుత్తు కేంద్రం ఏర్పాటుతో మణుగూరు పారిశ్రామికంగా విరాజిల్లుతుంది. అయితే 2009-15 మధ్యలో ఏర్పాటైన మణుగూరు ఓపెన్ కాస్ట్‌తో పట్టణ ముఖచిత్రం నుంచి గ్రామాలు కనుమరుగయ్యాయి. మళ్లీ ఇప్పుడు బీటీపీఎస్ రైలు మార్గం కోసం పట్టణంలోని 113 ఇళ్లను తొలగించనున్నారు. ఈ నేపథ్యంలో మణుగూరు మళ్లీ కొత్తరూపు సంతరించుకోనుంది. ఇప్పటికే రైలు మార్గం కోసం సేకరించిన ఇళ్లను రెవెన్యూశాఖ నేలమట్టం చేస్తోంది.

ప్రత్యేక ఆకర్షణగా రైలు మార్గం

పట్టణ నడిబొడ్డు నుంచి బీటీపీఎస్ రైలు మార్గం ఏర్పాటు కానుంది. దీంతో ఆ రైలు మార్గం ప్రత్యేక ఆకర్షణగా నిలువనుంది. ఓ వైపు నివాసాలు, మరోవైపు రైలు మార్గం నుంచి బొగ్గు రవాణా జరగనుంది. అంతేకాకుండా రైలుమార్గం కోసం ఏర్పాటు చేస్తున్న వంతెనలు సైతం పట్టణ మార్పునకు సంకేతం కానున్నాయి. రాజుపేటకు వెళ్లే రోడ్డులో అండర్ బ్రిడ్జి నిర్మించారు. విద్యుత్తు కార్యాలయం సమీపంలో ప్రధాని రహదారిపై మరో అండర్ బ్రిడ్జి నిర్మించనున్నారు. చెరువుముందు గ్రామంలో రైలు మార్గం వై జంక్షన్‌ను ఏర్పాటు చేయనున్నారు.

పట్టణ విస్తరణ అనివార్యం



సింగరేణి బొగ్గు గనులు, రైలు మార్గం ఏర్పాటుతో మణుగూరు పట్టణం విస్తీర్ణం తగ్గుతుంది. భవిష్యత్తులో పట్టణ విస్తరణ అనివార్యం కానుంది. పట్టణ జనాభా క్రమేణా పెరుగుతుంది. యునైటెడ్ నేషన్స్ పాపులేషన్ ఫండ్ సంస్థ సర్వేలో జనాభా పెరుగుదలలో మణుగూరు తొలి స్థానంలో ఉంది. ఈక్రమంలో జనాభాకు తగిన సౌకర్యాలు, నివాసాలు అవసరం కానున్న నేపథ్యంలో పట్టణానికి ఆనుకొని ఉన్న పంచాయతీల్లోని కొంత భాగాన్ని పురపాలకంలో కలిపితే ఉపయోగకరంగా ఉంటుంది. కొన్నేళ్ల క్రితం సమితిసింగారంలోని కొంత భాగాన్ని పురపాలకంలో కలపాలని అధికారులు సర్వే చేశారు. కానీ కార్యరూపం దాల్చలేదు. ఏదేమైనా రానున్న కాలంలో మణుగూరు పట్టణం విస్తరణ వైపు దిశగా వెళ్లాల్సిన అవసరం ఉంది.

దశల వారీగా కూల్చి వేస్తున్నాం

నాగరాజు, తహసీల్దార్

బీటీపీఎస్ రైలు మార్గం కోసం తీసుకొన్న ఇళ్లను దశల వారీగా కూల్చి వేస్తున్నాం. అర్అండ్ఆర్ ప్యాకేజీ తీసుకొన్న వారు ఇళ్లను ఖాళీ చేయాలని సూచించాం. ఇప్పటి వరకు 15 ఇళ్లు నేలమట్టం అయ్యాయి.

# ఎక్కడి వాళ్లక్కడే!

హనుమకొండ : పారిశుద్ధ్య కార్మికుల పనితీరు అస్తవ్యస్తంగా మారింది. కొందరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పనిచేసేది ఒక దగ్గర, బయోమెట్రిక్ అటెండెన్సు మరో చోట వేస్తున్నారు. దీనివల్ల సుమారు 250-300 మంది కార్మికులు ఎక్కడ పనిచేస్తున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. కొందరు అటెండెన్సు వేసి ఇంటికెళ్తున్నట్లు గుర్తించారు. ఇలాంటి పని దొంగలను పట్టేందుకు ప్రజారోగ్య విభాగం దృష్టి సారించింది. వారం రోజుల క్రితం కొత్త కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లో పర్యటించినప్పుడు ఐదారుగురు శానిటేషన్ కార్మికులు ఎక్కడ పనిచేస్తున్నారో చూపించ లేకపోయారు. బయోమెట్రిక్ అటెండెన్సులో విధులకు హాజరైనట్లుగా ఉంది, వాళ్లు ఎక్కడున్నారని కమిషనర్ అడిగితే శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు బేలచూపులు చూశారు. పొంతన లేని సమాధానాలు చెప్పడంపై కమిషనర్ అసహనం వ్యక్తం చేశారు. ఎక్కడ బయోమెట్రిక్ అటెండెన్సు వేస్తున్నారో అదే డివిజన్‌లో పనిచేసేలా చూడాలని కమిషనర్ ఆదేశించారు. నగరంలోని 66 డివిజన్ల వారీగా పారిశుద్ధ్య కార్మికుల జాబితా సిద్ధమైంది. ఎక్కడి వాళ్లక్కడే పనిచేసేలా కొత్త పద్ధతి అమల్లోకి రానుంది.

10వేల జనాభాకు 28 మంది కార్మికులు : రాష్ట్ర పురపాలక శాఖ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం నగరంలోని 66 డివిజన్ల వారీగా పారిశుద్ధ్య కార్మికుల కేటాయింపుపై గ్రేటర్ వరంగల్ ప్రజారోగ్య విభాగం దృష్టి సారించింది. 10 వేల జనాభా కలిగిన డివిజన్‌కు 28 మంది కార్మికులు పనిచేయాలి. ఇదే పద్ధతిన డివిజన్ల వారీగా జనాభాను



పరిగణలోకి తీసుకొని శానిటేషన్ కార్మికులను కేటాయిస్తారు. ఒక్కో డివిజన్‌కు 35-40 మందిని కేటాయించే అవకాశాలున్నాయి. ఎక్కడి వాళ్లక్కడే పని చేసేలా జాబితా సిద్ధం చేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. జూన్ మొదటి వారం నుంచి కొత్త విధానం అమల్లోకి రానుంది.

కార్మికుడి నిరసన: హనుమకొండ ప్రాంతంలో పనిచేస్తున్న కె.చిన్నబాబు అనే శానిటేషన్ కార్మికుడు సోమవారం మధ్యాహ్నం బల్దియా ప్రధాన కార్యాలయంలోని ముఖ్య ఆరోగ్యాధికారి ఛాంబర్ ముందు హల్‌చల్ చేశారు. ఒక డివిజన్ నుంచి మరొక డివిజన్‌కు వెళ్లాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఒత్తిడి చేస్తున్నారంటూ కాలం చెల్లిన సిరప్(మందు) తాగారు. వెంటనే అక్కడున్న వారు వారించి ఆసుపత్రికి తరలించారు. ఆరో డివిజన్‌లో పనిచేస్తున్నానని, 51 డివిజన్‌కు వెళ్లాలని ఇన్‌స్పెక్టర్ ఒత్తిడి చేశారని ఆరోపించారు.

పారదర్శకం చేస్తాం

- డాక్టర్ రాజేష్, ముఖ్యఆరోగ్యాధికారి

పారిశుద్ధ్య కార్మికుల పనితీరు పారదర్శకం చేస్తాం. కార్మికులు ఎక్కడైతే బయోమెట్రిక్ అటెండెన్సు వేస్తారో అక్కడే పనిచేయాలి. 66 డివిజన్ల వారీగా జాబితా సిద్ధమైంది. హనుమకొండకు చెందిన కార్మికుడి ఘటనపై విచారణ చేపడతాం.

# రుణమాఫీ.. అన్నదాతలు ఖుషి!!

వరంగల్ : రాష్ట్ర ప్రభుత్వం 2018 ఎన్నికల్లో ఇచ్చిన రుణమాఫీ హామీ అమలు కానుంది. ఇప్పటి వరకు రూ.36 వేల వరకు మాత్రమే మాఫీ అయింది. రూ.50 వేలు, అంతకంటే ఎక్కువ రుణం ఉన్న రైతులు మూడేళ్ల నుంచి నిరీక్షిస్తున్నారు. ఎట్టకేలకు ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయం తీసుకోవడంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో అన్నదాతలకు ప్రయోజనం కలగనుంది.

పట్టరాని ఆనందం.. పొలంలోనే సంబరం

రూ.లక్ష రుణమాఫీ ప్రకటించినందుకు సంతోషంగా హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం సీతంపేటలో వరి నాటు వేయడానికి సిద్ధం చేసిన బురద పొలంలో ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

అమలు కాని ప్రణాళికలు..

2018 డిసెంబరు 11వ తేదీ నాటికి పంటరుణాల బకాయిలు రూ.లక్షలోపు వరకు మాఫీ చేయనున్నట్లు 2020 మార్చిలో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మొదటి విడతలో రూ.25 వేల లోపు మాత్రమే మాఫీ చేశారు. రెండో విడతలో రూ.50 వేల వరకు చేసేందుకు



చర్యలు చేపట్టినా రూ.36 వేల వరకు మాత్రమే అయింది. మిగతా వారు ఎదురుచూస్తున్నారు. రూ.50 వేల లోపు తీసుకున్న వారికి సంబంధించి రుణాలను 2021 ఆగస్టు 16 నుంచి 31 వరకు మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించినా కార్యరూపం దాల్చలేదు. మూడో విడతలో రూ.75 వేల వరకు, నాలుగో విడతలో రూ.లక్ష వరకు మాఫీ చేయాలని ప్రణాళికలు రూపొందించినా అమలు కాకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతూ వచ్చారు.

ఉమ్మడి జిల్లా డీసీసీబీలో..

ఉమ్మడి వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు పరిధిలోని 70 ప్రాథమిక సహకార సంఘాల్లో సభ్యులైన 43,434 మంది రైతులకు రూ.లక్షలోపు రుణమాఫీ అవుతుంది. మొదటి విడతలో 11,430 మందికి రూ.25 వేల చొప్పున రూ.6.49 కోట్లు, రెండో విడతలో 4,462 మందికి రూ.36 వేల చొప్పున రూ.16.50 కోట్లు మాఫీ చేశారు. ప్రస్తుతం 27,542 మంది రైతులకు రూ.37 వేల నుంచి రూ.లక్ష వరకు మొత్తం రూ.220.96 కోట్లు మాఫీ చేయనున్నారు.

వివరాలు సేకరిస్తున్న బ్యాంకులు

ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని కమర్షియల్ బ్యాంకుల ద్వారా రూ.లక్షలోపు రుణం తీసుకున్న రైతుల వివరాలు ఆరు జిల్లాల పరిధిలోని లీడ్ బ్యాంకు మేనేజర్లు, జిల్లాల వ్యవసాయ శాఖల అధికారులు వద్ద లేకపోవడం గమనార్హం. సర్కారు నుంచి పేర్లు వస్తాయి.. అనే సమాధానం చెప్పడం విస్మయం కలిగిస్తోంది. రైతుల వివరాలే బ్యాంకు వద్ద లేనప్పుడు రుణమాఫీ ఎవరికి చేస్తారనే ప్రశ్న?గా ఉంది. ప్రభుత్వ ప్రకటన వెలువడిన దరిమిలా వివరాలు సేకరించే పనిలో పడ్డారు.

# నిరీక్షించినా నిరాశే!

జమ్మికుంట: ఈ పరిస్థితి రాజయ్య ఒక్కరిదే కాదు.. 2021-22 సీజన్ విక్రయాల సమయంలో ధరలు బాగా పెరగడంతో 2022-23 సీజన్‌లోనూ భారీగా ధరలు పెరుగుతాయని ఆశించి చాలా మంది రైతులు ఇళ్లలో పత్తిని నిల్వ చేశారు. ఎంతకూ ధరలు పెరిగే పరిస్థితి కనిపించకపోవడం.. ప్రస్తుతం సాగుకు డబ్బులు అవసరమవడంతో మార్కెట్‌కు తెచ్చి విక్రయించడం ప్రారంభించారు. దీంతో జమ్మికుంట మార్కెట్‌లో నాలుగు రోజులుగా రోజూ 40 నుంచి 20 ట్రాలీల విడిపత్తి విక్రయాలు జరుగుతున్నాయి.

2021- 22 సీజన్‌లో 2021 నవంబరులో జమ్మికుంట మార్కెట్‌లో పత్తి ధర క్వింటా రూ.14 వేలు గరిష్ఠ ధర పలికింది. 2022-23 సీజన్ విక్రయాలు గతేడాది అక్టోబర్ నుంచి ప్రారంభం కాగా గరిష్ఠ



ధర రూ.9,500 మాత్రమే పలికింది. దీంతో ధర పెరుగుతుందేమోనని రైతులు ఆశగా ఉండగా తాజాగా రూ.7,300కు చేరింది.

విక్రయాల సీజన్ ఆరంభంలో వరంగల్, పెద్దపల్లి మార్కెట్ల కంటే జమ్మికుంటలో అధిక ధర పలకటంతో జయశంకర్ భూపాలపల్లి, వరంగల్, పెద్దపల్లి, హన్మకొండ జిల్లాలకు చెందిన పలువురు రైతులు ఇక్కడికి పత్తి తెచ్చి విక్రయించారు. మొదట్లో రోజుకు 250 ట్రాలీల దాకా విడిపత్తి విక్రయాలు జరిగాయి.

ధరల పతనంతో పత్తి విక్రయాలు నాలుగు రోజుల కిందటి వరకు బాగా తగ్గాయి. ఇటీవల వరకు రోజూ 2 నుంచి 10 నుంచి ట్రాలీల పత్తి మాత్రమే విక్రయానికి వచ్చింది. నాలుగు రోజులుగా మాత్రం మళ్లీ పరిస్థితి మారుతోంది. మార్కెట్‌కు రోజూ 20 నుంచి 40 ట్రాలీల పత్తి విక్రయానికి వస్తోంది. సీజన్ ముగింపు దశకు చేరటంతో ధర పెరుగుదలపై ఆశలు వదులుకున్న రైతులు పత్తిని విక్రయానికి తీసుకొస్తున్నారు.

నిరీక్షించి నష్టపోయా : వీణవంక మండలం మామిడాలపల్లికి చెందిన ఈ రైతు పేరు [illegible] రాజయ్య పత్తి క్వింటాలు రూ.9 వేలు పలికినప్పుడూ విక్రయించలే. ఇంకా పెరుగుతుందని ఆశతో ఉండిపోయి ఇంట్లో నిల్వ చేశాడు. ఫలితం లేకపోవడంతో ప్రస్తుతం సాగు పెట్టుబడులకు డబ్బు అవసరమై రూ.7,100కు క్వింటాలు చొప్పున విక్రయించాడు. పెట్టుబడుల కోసం విధి లేక తక్కువ ధరైనా విక్రయించాం అని వాపోతున్నారు.

ఫలితం లేదని విక్రయిస్తున్నారు : ధర కోసం నెలల తరబడి నిరీక్షించిన రైతులు ఇక ధర పెరగదని నిర్ధారణ చేసుకుని పత్తిని విక్రయానికి తీసుకు వస్తున్నారు. నాలుగు రోజుల కిందట వరకు చాలా తక్కువగా వచ్చేది. ప్రస్తుతం 40 ట్రాలీల వరకు విక్రయానికి వస్తోంది. ఇప్పటికీ ఇతర మార్కెట్ల కంటే జమ్మికుంటలో అధిక ధర పలుకుతుండటంతో ఇతర జిల్లాల రైతులు విక్రయానికి తీసుకొస్తున్నారు. జి.రెడ్డినాయక్, ప్రత్యేక శ్రేణి కార్యదర్శి

# బడి.. పర్యవేక్షణ కొరవడి!



వరంగల్ : జిల్లాలో విద్యా వ్యవస్థపై పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. రెగ్యులర్ ఎంఈవోలు లేకపోవడంతో పాఠశాలలను తనిఖీ చేసే దిక్కులేకుండా పోతోంది. విద్యార్థుల సంఖ్య తగ్గిపోతున్నా.. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించకుండా అడిగేవారు లేరు. పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు పట్టించుకొనే దిక్కులేదు. విద్యా సంవత్సరం ప్రారంభమై 50 రోజులు కావస్తోంది. ఇప్పటికీ పూర్తిస్థాయిలో ఉచిత పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు అందలేదు. వాటిని తెప్పించే రెగ్యులర్ మండల విద్యాధికారులు లేరు. పలు పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత తీవ్రంగా ఉండి విద్యార్థులు నష్టపోతున్నా వాటిని గుర్తించి సర్దుబాటు చేసే పరిస్థితి లేదు.

అంతా సీనియర్ ప్రధానోపాధ్యాయులే..: జిల్లాలో 13 మండలాలు ఉన్నాయి. ఒక్కచోట కూడా రెగ్యులర్ ఎంఈవో లేరు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సీనియర్ ప్రధానోపాధ్యాయులకే ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. సంగెం మండలం గవిచర్ల జడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయుడు ఎన్.విజయ్‌కుమార్‌కు వరంగల్, ఖిలా వరంగల్, సంగెం మండలాల బాధ్యతలు అప్పగించారు. పర్వతగిరి మండలం వడ్లకొండలోని జడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం సీహెచ్.సత్యనారాణయ గీసుగొండ, దుగ్గొండి, నల్లబెల్లి, పర్వతగిరి మండలాల బాధ్యతలు చూస్తున్నారు. నెక్కొండ మండలం రెడ్లవాడలోని జడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయురాలు రత్నమాల నెక్కొండ, చెన్నారావుపేట, నర్సంపేట, ఖానాపూర్ ఇన్‌ఛార్జి ఎంఈవోగా అదనపు బాధ్యతలు చూస్తున్నారు. రాయపర్తి మండలం కొండూర్‌లోని జడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం ఎన్.రంగయ్యకు వర్ధన్నపేట, రాయపర్తి మండలాల బాధ్యతలు ఇచ్చారు. వారు ఇటు పాఠశాలల్లో పాలనా బాధ్యతలు.. అటు మండలాల్లో పర్యవేక్షణ చేయలేక సతమతం అవుతున్నారు.

'పది' ఫలితాలపై ప్రభావం.. పాఠశాలలపై పర్యవేక్షణ కొరవడంతో దాని ప్రభావం పదో తరగతి పరీక్ష ఫలితాలపై పడుతోంది. మారుమూల గ్రామాల్లోని పాఠశాలలకు ఉపాధ్యాయులు సరిగా వెళ్లడం లేదన్న విమర్శలు ఉన్నాయి. తనిఖీలు చేసి విద్యా వ్యవస్థలను గాడిన పెట్టాల్సిన ఎంఈవోలు లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది. సబ్జెక్టు ఉపాధ్యాయులు లేక పదో తరగతి విద్యార్థులు నష్టపోతున్నా ప్రత్యామ్నాయ చర్యలు లేవు. రెగ్యులర్ ఎంఈవోలే కాదు.. జిల్లాలో చాలా చోట్ల రెగ్యులర్ ప్రధానోపాధ్యాయ పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయి.

ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం..

జిల్లాలో రెగ్యులర్ ఎంఈవోలు ఒక్కరు కూడా లేనిది వాస్తవమే. ప్రభుత్వం, రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు ఉన్నత పాఠశాలల్లోని క్రమశిక్షణ కలిగిన సీనియర్ ప్రధానోధ్యాయులకు ఇన్‌ఛార్జి ఎంఈవోలుగా బాధ్యతలు అప్పగించాం. ప్రస్తుతం వారితోనే పర్యవేక్షణ కొనసాగిస్తున్నాం. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. ప్రతి మండలానికి విద్యాశాఖ అధికారి ఉంటే విద్యా వ్యవస్థ బలోపేతం అవుతుంది. డి.వాసంతి, డీఈవో

# రైల్వే స్టేషన్లకు విమానాశ్రయ హంగులు



వరంగల్ : కేంద్రం ప్రకటించిన అమృత్ భారత్ రైల్వే స్టేషన్ల పథకం కింద ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాజీపేట, జనగామ, మహబూబాబాద్ రైల్వే స్టేషన్లను విమానాశ్రయాల తరహాలో అభివృద్ధి చేయనున్నారు. తెలంగాణలో 39 రైల్వే స్టేషన్లు ఎంపిక కాగా ఉమ్మడి వరంగల్ నుంచి మూడు ఉన్నాయి. వీటికి రూ.88.7 కోట్లను కేటాయించారు. ఈ నెల 6న ఉదయం 9 గంటలకు వర్చువల్ విధానంలో ప్రధాని నరేంద్రమోదీ పనులకు శంకుస్థాపన చేస్తారు.

ఎలా అభివృద్ధి చేస్తారంటే..

రైల్వే స్టేషన్ల ముందు ఉన్న స్థలం మొత్తం సుందరీకరణ, వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా ఐలాండ్‌లను నిర్మిస్తారు. కారులో వచ్చే వారు నేరుగా రైల్వే స్టేషన్ ప్లాటుఫారం ముందు దిగే విధంగా (ఎయిర్‌పోర్టు మాదిరి) ప్రణాళికలను రూపొందిస్తున్నారు. స్టేషన్ భవనాల రూపును పూర్తిగా మార్చేస్తారు. ప్రస్తుతం జనగామ, మహబూబాబాద్ రైల్వే స్టేషన్‌లు పాతకాలం భవనాల్లా ఉంటాయి. ప్రాంగణం కూడా తక్కువ స్థలంలో ఉంది. మహబూబాబాద్ రైల్వే స్టేషన్ ముందు భాగం మరీ ఇరుకుగా ఉంది. దీనికి పక్కనే ఉన్న రైల్వే క్వార్టర్ల స్థలాన్ని కూడా కలుపుకోవడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

కాజీపేట రైల్వే స్టేషన్ ముందు చాలినంత స్థలం ఉంది. స్టేషన్ ముందు భాగాన పెద్ద ఐలాండ్ ఏర్పాటు చేయడానికి పక్కనే ఉన్న జీఆర్‌పీ, ఆర్పీఎఫ్ పోలీసు స్టేషన్ భవనాలను పూర్తిగా తొలగించి వాటి స్థానంలో ఒకే భవనాన్ని నిర్మించి అందులో పోలీసు స్టేషన్లను ఏర్పాటు చేయనున్నారు. స్టేషన్ రోడ్‌ను మరింత విశాలం చేయడానికి కూడా రైల్వే సంబంధిత విభాగాలను తరలించడానికి కూడా ప్రయత్నాలు చేస్తున్నారు.

ఆధునిక సదుపాయాలు..ప్రయాణికుల కోసం కూడా ఆధునిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకొస్తారు. టికెట్ తీసుకునే విధానాన్ని ఆధునికీకరించి స్టేషన్‌లో ఎక్కడ నుంచైనా మొబైల్ ద్వారా లేదా ఆటోమేటిక్ టెల్లర్ యంత్రాల ద్వారా టికెట్ తీసుకునే సదుపాయం కల్పిస్తారు. స్టేషన్ ప్రవేశ ద్వారం వద్ద ఎస్కలేటర్, లిఫ్టులను ఏర్పాటు చేస్తారు. సామానులను స్కానింగ్ చేసే యంత్రాలు ఉంటాయి. ప్రయాణికులకు సహాయ కేంద్రాలను అందుబాటులోకి తెస్తారు.

స్థానిక ఉత్పత్తులకు సరైన గుర్తింపు కల్పించేందుకు 'వన్‌స్టేషన్ వన్ ప్రొడక్ట్' దుకాణాలకు చోటు కల్పిస్తారు.

స్టేషన్లకు ఇరువైపులా ఉన్న పట్టణ ప్రాంతాలతో అనుసంధానం చేసేందుకు ప్రాధాన్యమిస్తారు.

విశ్రాంతి గదులకు ప్రాధాన్యం

ప్రయాణికుల విశ్రాంతి కోసం అమృత్ రైల్వే స్టేషన్‌లలో ప్రాధాన్యమిస్తున్నారు. ఇప్పుడు ఉన్న విశ్రాంతి గదులను పూర్తిగా తొలగించి వాటి స్థానంలో అందరూ ఒకే దగ్గర ఉండే విధంగా ఒకే పెద్ద హాలును నిర్మించి సదుపాయాలను ఒకే చోట కేంద్రీకరిస్తారు. ప్రముఖులు వేచి ఉండటానికి కూడా ప్రత్యేక లాంజ్‌లను ఏర్పాటు చేస్తారు. రెండో ప్లాటుఫారం మీద కూడా ప్రయాణికులు వేచి ఉండటానికి సదుపాయాలు కల్పిస్తారు. ఆర్వోఆర్ తాగునీటిని కుళాయిల ద్వారా అందిస్తారు.

# రోడ్డు బాగుకు ఊరంతా కదిలింది..

వరంగల్ : ఎవరో వచ్చి ఏదో చేస్తారని చూడకుండా ఆ గ్రామస్థులంతా ఒక్కటయ్యారు. ఇటీవల కురిసిన భారీ వర్షానికి దెబ్బతిన్న రహదారిని ఊరంతా కలిసి బాగుచేసుకుని ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలిచారు. వివరాల్లోకి వెళితే.. ములుగు మండల పరిధిలోని ఓ మారుమూలన బొగ్గులవాగు అవతలివైపున అంకన్నగూడెం అనే గిరిజన గ్రామం ఉంది. ఆ గ్రామంలో సుమారు వంద కుటుంబాలు నివసిస్తున్నాయి. గత నెలలో కురిసిన భారీ వర్షాలు, వరదల ఉధ్ధృతికి గ్రామానికి వెళ్లే రోడ్డు కొట్టుకుపోయింది. లక్నవరం చెరువుకు ప్రధాన ఆధారం ములుగు నుంచి అంకన్నగూడెం వెళ్లాలంటే సర్వాపురం-అంకన్నగూడెం గ్రామాల మధ్యలో బొగ్గుల వాగు ప్రవహిస్తుంది. ఈ వాగు పర్యాటక ప్రాంతమైన లక్నవరం చెరువుకు ప్రధాన ఆధారం. దీని ద్వారా వచ్చిన వరదతోనే లక్నవరం చెరువు నిండుతుంది. వాగు ప్రవహించకపోతే లక్నవరం జలాశయంలో నీళ్లుండవు. వర్షాల సమయంలో వాగు ప్రవాహం తీవ్రంగా ఉంటుంది.

నాలుగు రోజులుగా నిలిచిన రాకపోకలు

అంకన్నగూడెం గ్రామస్థులు బొగ్గులవాగు అవతలిపైపు వెళ్లడానికి వాగుపై తక్కువ వెడల్పుతో ఓ వంతెన నిర్మించారు. వంతెన బాగానే ఉన్నా.. అవతలివైపు గ్రామానికి వెళ్లే దారిలో తారు రోడ్డు కొంత భాగం కొట్టుకుపోవడంతో పాటు రోడ్డుపై పలుచోట్ల పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి కాలినడకన కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. వీరంతా వాగు దాటి సర్వాపురంతో పాటు మండల కేంద్రానికి నిత్యం వారి అవసరాల కోసం వస్తుంటారు. రోడ్డు తెగిపోవడంతో.. నాలుగు రోజుల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. సైన్యంలా ముందుకు..వాగు ప్రవాహానికి కోతకు గురై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. రాకపోకలను పునరుద్ధరించాల్సిన ఐటీడీఏ అధికారులు కనీసం గ్రామాన్ని సందర్శించిన దాఖలాలు లేవు. నాలుగు రోజులుగా రవాణా సౌకర్యం కోల్పోయి గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అధికారుల కోసం ఎదురు చూశారు. ప్రభుత్వం నుంచి స్పందన కరవైంది. లాభం లేదనుకుని ఊరంతా కలిసికట్టుగా సైన్యంలా ముందుకు కదిలింది. తొలుత శ్రమదానం చేసి రాళ్లను గుంతల్లో నింపారు. ట్రాక్టర్, డోజర్‌ను సమకూర్చుకుని కోతకు గురైన రోడ్డును బాగు చేసుకుని రాకపోకలను పునరుద్ధరించుకున్నారు.

# పారిశ్రామిక వాడలు.. సమస్యలకు నిలయాలు

కరీంనగర్ : ఒక ప్రాంతం ఆర్థికంగా బలపడాలంటే పారిశ్రామిక రంగం అభివృద్ధి చెందాలి. ఒక పరిశ్రమ నెలకొల్పితే అనేక మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించడంతోపాటు ఆ ప్రాంతం ప్రగతి పథంలో దూసుకెళ్తుంది. అలాంటిది పారిశ్రామికవాడల్లో సరైన సౌకర్యాలు లేక పరిశ్రమల యజమానులు, కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. రూ.లక్షల్లో పన్నులు చెల్లిస్తున్నా మౌలిక సదుపాయాల కల్పనలో మాత్రం ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోంది. జిల్లాలోని పారిశ్రామికవాడల దుస్థితిపై 'న్యూస్‌టుడే' కథనం.

పన్నులు చెల్లిస్తున్నా..

జిల్లాలో రెండు పారిశ్రామిక వాడలు ఉన్నాయి. పద్మనగర్ ఇండస్ట్రీయల్ పార్క్, రెండోది ఆటోనగర్. రెండింటిలో 205 యూనిట్లు ఉన్నాయి. పద్మనగర్‌లో విత్తనశుద్ధి, బ్రెడ్ తయారీ, రైస్ మిల్లు, తదితర పరిశ్రమలు ఉండగా, ఆటోనగర్‌లో ఆటోమొబైల్, మరమ్మతు యూనిట్లు ఉన్నాయి. పద్మనగర్ పారిశ్రామిక వాడ సమస్యలకు నిలయంగా మారింది. మురుగునీటి కాల్వలు శిథిలావస్థకు చేరాయి. వర్షం పడితే నీరంతా రోడ్లపైకి చేరుతుంది. వీధి దీపాలు వెలగడం లేదు. 2019లో మౌలిక వసతుల కల్పనకు రూ.80 లక్షలు మంజూరయ్యాయి. ఆ నిధులతో కొంతమేర సీసీ రోడ్లు వేసి వదిలిపెట్టారు. ఏటా పరిశ్రమల నుంచి లక్షలాది రూపాయల పన్నులు వసూలు అవుతున్నా సమస్యలు పరిష్కరించడంలేదు. ఆటోనగర్‌లో కూడా సమస్యలు తిష్ఠ వేశాయి.




రహదారులు, మురుగుకాల్వలు, వీధి దీపాలు లేక ఇబ్బందిగా మారింది. గతంలో రోడ్ల నిర్మాణానికి రూ.40 లక్షలు విడుదల చేసినా అవి సరిపోలేదని అంటున్నారు.

అసంపూర్తిగా భగీరథ పైపులైన్..

పద్మనగర్ పారిశ్రామికవాడ పక్కనే ఓవర్‌హెడ్ ట్యాంకు ఉన్నా కనీసం నీటి వసతి లేదు. ట్యాంక్ వద్దకు పరుగులు పెట్టాల్సి వస్తోంది. నీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ పారిశ్రామికవాడ యజమానులు అప్పటి మేయర్ రవీందర్‌సింగ్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌ను కలిసి విన్నవించారు. త్వరలోనే తాగునీటిని అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చినా ఇప్పటికీ అమలుకాలేదు. మిషన్ భగీరథ ద్వారా సరఫరా చేస్తామని పైపులైన్ వేసి వదిలేశారు.


మందుబాబులకు అడ్డాగా...పద్మనగర్ పారిశ్రామికవాడ మందుబాబులకు, డ్రైవింగ్ స్కూళ్ల వారికి అడ్డాగా మారింది. చీకటి పడితే చాలు ఆ ప్రాంతంలో మందుబాబులు సంచరిస్తుంటారు. పరిశ్రమల్లో పని చేసే కార్మికులు, స్థానికులు రాత్రి పూట బయటకు రావాలంటే ఇబ్బంది పడుతున్నారు. మరో వైపు పలు డ్రైవింగ్ స్కూళ్లు కారు చోదక శిక్షణను ఇక్కడే ఇస్తున్నాయి.ఏళ్లు గడుస్తున్నా నీటి సౌకర్యం లేదు..- సంఘయ్య, పరిశ్రమ యజమాని

పద్మనగర్ పారిశ్రామికవాడలో తాగునీటి సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నాం. ఈ విషయంపై అప్పటి మేయర్ రవీందర్‌సింగ్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌ను కలిసి విన్నవించాం. నీటి సమస్య తీర్చుతామని హామీ ఇచ్చారు. ఇప్పటికీ నెరవేరలేదు.మురుగు కాల్వలు లేవు..- రాగుల రామస్వామి గౌడ్, పరిశ్రమ యజమానిపారిశ్రామికవాడలో సరైన రహదారులు లేవు. మురుగునీటి కాల్వలు శిథిలావస్థకు చేరాయి. పరిశ్రమల నుంచి వచ్చే మురుగు నిలిచిపోతుంది. వాసన, దోమల బెడద వేధిస్తోంది. మందుబాబులు, ఇతర వాహనాలు రాకుండా గేట్ ఏర్పాటు చేసి సెక్యూరిటీ సిబ్బందిని నియమించాలి.

ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం.. -స్వామి, జోనల్ మేనేజర్, టీఎస్ఐఐసీ కరీంనగర్పారిశ్రామికవాడల్లో పరిశ్రమల యజమానులకు ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. వీధి దీపాలు పోయిన చోట కొత్తవి బిగిస్తున్నాం. రోడ్లపై చెత్తను తొలగించడానికి చర్యలు చేపట్టాం. మిషన్ భగీరథ ద్వారా నీరు అందించడానికి పైప్‌లైన్ వేశాం.

# వాన నీటి సంరక్షణే అత్యంత కీలకం

జగిత్యాల : అధికవర్షం కురిసిన సందర్భాల్లో వరదతో ఇబ్బందులు తలెత్తినా ఏడాది పొడవునా అన్నింటికీ ఆధారమైన వర్షపునీటి సంరక్షణ, వినియోగం అత్యంత ఆవశ్యంగా మారింది. వ్యవసాయాధారిత జిల్లాలో వర్షపునీటికి ఎనలేని ప్రాధాన్యం ఉంది. ఈ వానాకాలంలో జిల్లాలో జూన్ 1 నుంచి ఇప్పటివరకు సాధారణ వర్షపాతం 455.1 మి.మీ ఉండగా 650.9 మి.మీ వర్షం కురిసింది. సాలీనా కురవాల్సిన వర్షంలో 60 శాతం వర్షం ఇప్పటికే కురవగా నీటి వనరులు నిండగా మిగిలిన జలాలు వృథాగా దిగువకు పారాయి. జిల్లాలోని 4.33 లక్షల ఎకరాల సాగులో 2.42 లక్షల ఎకరాల పైర్లకు వర్షపునీటితో ఉబికివచ్చే భూగర్భ



జలాలే ప్రధాన నీటివనరుగా ఉండటం వాననీటి ప్రాధాన్యతను కళ్లకు కడుతోంది.ఒక ఏడాదిలో సరాసరిగా 85-103 గంటల వాన మాత్రమే కురుస్తుండగా ఈ వర్షపు నీటిని ఒడిసి పట్టుకుని ఏడాది పొడవునా వినియోగించుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతానికి వర్షపునీటి వినియోగం 10-17 శాతం మాత్రమేకాగా ఇది మరో 12 శాతం పెంచగలిగితే సాగు, తాగునీటి సమస్యలు తీరతాయని నిపుణుల అంచనా. వర్షపాతంలో దాదాపు 40-51 శాతం వరకు భూమిలోకి ఇంకకుండా పొలంబయటకు వృథాగా పోతోంది. వర్షపునీటితో నేల పైపొరల్లో విలువైన పోషకాలతో కూడిన మట్టి కొట్టుకుపోతుంది. దీనికిగాను ప్రతి పొలంలోనూ లోతట్టులో నీటినిల్వ కందకాలను తవ్వాలి. పండ్లతోటల్లో, వాలుకు అడ్డంగాదున్ని కాంటూరు సేద్యాన్ని అనుసరించాలి, తోటల్లో వాలుకు అడ్డంగా మట్టికట్టల ద్వారా వర్షపునీరు నిల్వఉండి నేలలోనే ఇంకేలా చేయవచ్చు.

వ్యవసాయ బావులను రీఛార్జ్‌చేసేలా బావికి సమీపంలో గుంతనుతవ్వి వృథానీటిని ఇందులోకి మళ్లించాలి. ఇళ్లలో ఇంకుడు గుంతలను సమర్థంగా నిర్వహించాలి, అటవీ ప్రాంతంలో వాటర్‌షెడ్ కార్యక్రమాల్లో భాగంగా ఉపాధిహామీ ద్వారా కాంటూరు కందకాలను పెద్దఎత్తున తవ్వి వర్షపునీటిని నేలలోకి ఇంకేలా చేయటం సత్ఫలితాలను ఇస్తోంది. జిల్లాలో 1,096 చెరువులుండగా అన్నింటిలోనూ పూర్తిస్థాయిలో వర్షపునీటిని నిల్వ చేయాలి. వ్యవసాయంలో నీటివినియోగ సామర్థ్యం 20-43 శాతం ఉండగా బిందు, తుంపర్ల సేద్యంతో 69-93 శాతం వరకు పెంచేవీలుండగా ఈ పరికరాలను రాయితీపై ఇవ్వాలి. మన తలసరి నీటి లభ్యత 1400 క్యూబిక్ మీటర్లుగా ఉంటే వాడకం 801 క్యూబిక్ మీటర్లు మాత్రమే కాబట్టి వినియోగ సామర్థ్యాన్ని పెంచాల్సిఉంది. ఎస్సారెస్పీలోనూ నీటినిల్వను 112 టీఎంసీలకు పెంచాలి.

# వసతులు మెచ్చేలా.. చదువులు నచ్చేలా..

ఖమ్మం : ఖమ్మంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ కళాశాల(స్వయం ప్రతిపత్తి)కి న్యాక్ ఏం గ్రేడ్ గుర్తింపు లభించింది. ఏడు అంశాల్లో క్యుములేటివ్ గ్రేడ్ పాయింట్ యావరేజ్ (సీజీపీఏ) 3.64 సాధించటం ద్వారా ఈ ఖ్యాతి దక్కింది. ఈమేరకు నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్(న్యాక్) డైరెక్టర్ ఉత్తర్వులు జారీచేసిన విషయం విదితమే. ఇప్పటివరకు ఈ కళాశాలకు న్యాక్ బీం గుర్తింపు మాత్రమే ఉంది. పరిశీలించిన ఏడు అంశాల్లోనూ పరిస్థితులు మెరుగుపడటంతో కళాశాలకు అరుదైన గుర్తింపు లభించింది. దీనిద్వారా కళాశాలకు భారీగా నిధులు మంజూరయ్యే అవకాశముంది. గతంలో ఐదేళ్లకు రూ.5 కోట్లు ప్రభుత్వం నుంచి మంజూరవగా ఈసారి గణనీయంగా పెరగొచ్చు.

**పునాది వేసిన 'గెంటేల'**

శ్రీరామభక్త గెంటేల నారాయణరావు విరాళంతో కొన్న 70 ఎకరాల స్థలంలో 1956లో కళాశాల ఏర్పాటైంది. 2015-16లో స్వయంప్రతిపత్తి పొందింది. ఖమ్మం, భద్రాద్రి, వరంగల్, మహబూబాబాద్, సూర్యాపేట, నల్గొండ జిల్లాలకు చెందిన 4,000 మంది విద్యార్థులు ఈ కళాశాలలో ప్రస్తుతం డిగ్రీ అభ్యసిస్తున్నారు. 800 మంది పీజీ చదువుతున్నారు. 54 గ్రూపులు కలిగిన కళాశాల.. అతిపెద్ద ప్రాంగణం, విశాలమైన తరగతి గదులు, డిజిటల్ విద్యాబోధన, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థుల సంపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి నిలయంగా మారింది. 104 మంది అధ్యాపకులు విధులు నిర్వర్తిస్తున్నారు.

**ప్రతిపాదిత అంశాలు**

పాఠ్యప్రణాళిక: సిలబస్ నాణ్యత, మార్పులు, సమకాలీన అంశాలు, సర్టిఫికెట్ కోర్సులు, విద్యార్థి స్టడీ ప్రాజెక్టులు, విద్యార్థులు, తల్లిదండ్రుల



నుంచి సిలబస్‌పై అభిప్రాయాలు.

బోధనాభ్యసనం- మూల్యాంకనం: విద్యార్థుల సంఖ్య, అధ్యాపకుల నాణ్యత, బోధనానుభవం, విద్యార్థి- అధ్యాపక నిష్పత్తి, మూల్యాంకన పద్ధతులు, పరీక్ష విభాగం పనితీరు.

పరిశోధన- సౌకర్యాలు: పరిశోధనల నిమిత్తం అధ్యాపకులు, విద్యార్థులకు సరిపడా సౌకర్యాలు- నాణ్యత, ప్రమాణాల పనితీరు.

భౌతిక- అభ్యసన సౌకర్యాలు: తరగతి గదులు, సాంకేతిక వినియోగం, క్రీడలు, సాంస్కృతిక సౌకర్యాలు, సైన్స్, కంప్యూటర్ ల్యాబ్స్, వాటిపై చేసిన ఖర్చులు.

విద్యార్థి సహకార అంశాలు- కొనసాగింపు: విద్యార్థి ఉపకార వేతనాలు, ఇతర ఆర్థిక చేయూత, ఫిర్యాదులు, పరిష్కార యంత్రాంగం, ప్లేస్‌మెంట్స్, ఉన్నత విద్య, విద్యార్థి కౌన్సిల్- పనితీరు, కళాశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థుల భాగస్వామ్యం.

పరిపాలన- నాయకత్వం: వివిధ పరిపాలన విభాగాలు- పనితీరు, విద్యార్థి, అధ్యాపకులకు గవర్నర్స్ నుంచి అందే శిక్షణ, ఐక్యూఏసీ- పనితీరు.

కళాశాల పాటించే విలువలు- ఉత్తమ విధానాలు: వాతావరణం, ప్రకృతి పరిరక్షణకు కళాశాల పాటించే విధానాలు, దివ్యాంగ విద్యార్థులకు సౌకర్యాలు, కళాశాల అభివృద్ధి, విద్యార్థుల ప్రగతికి అనుసరించే ప్రత్యేకమైన పద్ధతులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, టీఎస్‌కేసీ/టాస్క్ ద్వారా శిక్షణ పొందిన విద్యార్థుల నైపుణ్యాల పరిశీలన.

ఉత్తమ గ్రేడ్ సాధించటం ద్వారా గురుతర బాధ్యత పెరిగింది. కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి శుభాకాంక్షలు. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తాం. ప్రభుత్వం నుంచి వచ్చే నిధుల ద్వారా కళాశాలను మరింత అభివృద్ధి పరుస్తాం. డాక్టర్ హమ్మద్ జకీరుల్లా, ప్రిన్సిపల్ ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ కళాశాల

# హరితహారం లక్ష్యం దిశగా అడుగులు

జనగామ : జిల్లాలో అమలవుతున్న 'తెలంగాణకు హరితహారం' కార్యక్రమం లక్ష్యం దిశగా సాగుతోంది. తొమ్మిదో విడత హరితహారాన్ని విజయవంతం చేసేందుకు వివిధ ప్రభుత్వ శాఖలు వారి లక్ష్యం మేరకు కృషి చేస్తున్నాయి. జిల్లా, మండల, క్లస్టర్, గ్రామస్థాయి అధికారులు మొక్కలు నాటే పనులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. జిల్లాలో సుమారు 64 శాతం మేర మొక్కలు నాటే పనులు పూర్తి కాగా.. మిగతాది పూర్తి చేసేందుకు జిల్లా అధికారులు నిరంతరం మండలాలు, గ్రామాల్లో పర్యటిస్తున్నారు. అధికారులు, సిబ్బందికి సలహాలు, సూచనలు ఇస్తున్నారు.

**జిల్లాలో పరిస్థితి ఇలా..**

సాధారణంగా అటవీ విస్తీర్ణం 33 శాతం మేర ఉండాలి. జిల్లాలో ఒక శాతం మాత్రమే అటవీ ప్రాంతం ఉంది. ఇలాంటి ప్రాంతాల్లోనూ సాధారణ స్థాయికి తెచ్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణలో భాగంగానే 'తెలంగాణకు హరితహారం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మొదట గ్రామ నర్సరీలు ప్రైవేటు స్థలాల్లో ఉండగా.. ప్రభుత్వ స్థలాల్లో నెలకొల్పడంతో పాటు నాలుగు నెలలు ముందుగానే మొక్కలను పెంచేందుకు నిరంతర కార్యాచరణను అమలు చేస్తోంది. ప్రతి గ్రామానికి 10 వేల నుంచి 40 వేల వరకు మొక్కలు నాటేలా లక్ష్యాన్ని నిర్దేశించారు. ఇందుకోసం ప్రభుత్వం ప్రతి గ్రామంలో ఒక నర్సరీని నిర్వహిస్తోంది. హరితహారం కార్యక్రమం మొదట జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో ఉపాధిహామీ పథకం ద్వారా అమలయ్యేది. కాలక్రమంలో ఆయా ప్రభుత్వ శాఖలను భాగస్వాములను చేశారు.

**వందశాతం లక్ష్యాన్ని పూర్తి చేస్తాం**

జిల్లాలో తెలంగాణకు హరితహారం కార్యక్రమం వేగంగా సాగుతోంది. ప్రభుత్వ శాఖలన్నీ ఈ కార్యక్రమంలో భాగస్వాములవుతున్నాయి. ప్రస్తుతం అనుకూల వాతావరణం ఉండటంతో మొక్కలు నాటే కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. లక్ష్యం తక్కువగా ఉన్న శాఖలు మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించనున్నాయి. ఇప్పటి వరకు 64 శాతం లక్ష్యం పూర్తి కాగా మిగతాది పూర్తి చేస్తాం. గూడూరు రాంరెడ్డి, డీఆర్డీవో

# క్రమ శిక్షణ.. దేశరక్షణ



సత్తుపల్లి : బాల్యదశలోనే క్రమశిక్షణకు పెద్దపీట వేస్తూ దేశభక్తి నింపుతోంది. సాయుధ దళాలపట్ల యువతకు మక్కువ ఏర్పడేలా శారీరక దృఢత్వం పెంపొందిస్తోంది. పాఠశాల నుంచి కళాశాల, విశ్వవిద్యాలయ స్థాయి ఉన్నత విద్యాభ్యాసంలోనూ విద్యార్థులకు అండగా నిలుస్తోంది నేషనల్ క్యాడెట్ క్రాప్స్(ఎన్‌సీసీ) శిక్షణ. వృత్తిగత జీవితంలో ఉన్నత స్థితికి ఎదగడం కోసం, అత్యున్నత శిఖరాలను అధిరోహించడానికి దోహదపడుతోంది. మానసిక, శారీరక దృఢత్వాన్ని పెంపొందించే అత్యుత్తమ కోర్సుల్లో ఒకటైన ఈ శిక్షణపై అనేక మంది విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. పాఠశాలల్లో క్యాడెట్ల ఎంపిక ప్రక్రియ చేపట్టిన నేపథ్యంలో ఎన్‌సీసీ శిక్షణ విశిష్టతపై కథనం..

**మూడు ప్రభుత్వ పాఠశాలలకు అనుమతి**

ఉమ్మడి జిల్లాలో మూడు ప్రభుత్వ ఉన్నతపాఠశాలల్లో ఎన్‌సీసీ సర్టిఫికెట్ కోర్సు చేసేందుకు అవకాశముంది. ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ విద్యా సంవత్సరంలో 50 మంది విద్యార్థులు కోర్సుకు ఎంపికయ్యారు. భద్రాద్రి జిల్లా కొత్తగూడెంలోని ఆనందఖని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, చుంచుపల్లి ఉన్నత పాఠశాలల్లో 200 మంది విద్యార్థులు ఎన్‌సీసీ క్యాడెట్లుగా శిక్షణ పొందుతున్నారు. ఇవి గాక పలు ప్రైవేటు పాఠశాలలు కూడా అనుమతి పొందాయి.

**ఎన్‌సీసీ ముఖ్య ఉద్దేశం**

1948లో దేశ వ్యాప్తంగా ఎన్‌సీసీ శిక్షణలు ప్రారంభం కాగా నేడు మారుమూలలకు సైతం చేరుకుని క్రమశిక్షణకు మారుపేరుగా నిలుస్తున్నాయి. ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలనేలా ఎన్‌సీసీ తయారు చేస్తుంది. విద్యార్థులు, యువతలో ఆత్మస్థైర్యాన్ని నింపడంతోపాటు జాతీయ భావాన్ని పెంపొందించడం, ధైర్య సాహసాలు, నాయకత్వ లక్షణాలు అందుకునేలా ప్రోత్సహిస్తుంది. సమాజ సేవా, జాతీయ సమైక్యతాభావం కల్పిస్తుంది. వరదలు వంటి విపత్తుల్లోనూ ఎన్‌సీసీ క్యాడెట్లు తమ సహాయసహకారాలు అందించేందుకు అవకాశం ఉంటుంది.

**ప్రవేశాలకు అర్హత..పటిష్ఠ తర్ఫీదు**

13 ఏళ్లు నిండి 8, 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే ఎన్‌సీసీ క్యాడెట్లుగా చేరేందుకు అర్హత ఉంటుంది. శారీరక దృఢత్వం పరిగణలోకి తీసుకుని బరువు, ఎత్తు, పరుగు వంటి పోటీలను నిర్వహించి అర్హత సాధించిన విద్యార్థులను ఎంపిక చేస్తారు. రెండేళ్లపాటు ప్రతి నెలా మూడు రోజులు శిక్షణ ఇస్తారు. వీటితోపాటు ఇతర ప్రాంతాల్లోనూ సదరు క్యాడెట్లకు శిబిరాలు నిర్వహిస్తారు. డ్రిల్ ప్రాక్టీస్, ఆయుధ శిక్షణ, ఫైరింగ్, మ్యాప్ రీడింగ్, సామాజిక సేవా, ఆరోగ్య అంశాలపై అపార అనుభవం ఉన్న అధ్యాపకులచే తర్ఫీదు ఇస్తారు.

**కొలువుల్లో ప్రత్యేక రిజర్వేషన్లు**

పదో తరగతి స్థాయిలో 'ఎ' సర్టిఫికెట్, ఇంటర్ స్థాయిలో 'బి' సర్టిఫికెట్, ఆ పైస్థాయిలో ఎన్‌సీసీ 'సి' సర్టిఫికెట్లు అందిస్తారు. ఎన్‌సీసీ క్యాడెట్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పిస్తుంటాయి. 'సి' సర్టిఫికెట్ కోర్సు పూర్తి చేసిన వారికి మంచి అవకాశాలు వస్తాయి. ప్రధానంగా భారత ఆర్మీలో చేరాలనుకుంటే వీరికి ఎలాంటి ప్రవేశ పరీక్షలు ఉండవు. ఇందులో 50శాతం రిజర్వేషన్ ఉంటుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 2 శాతం అవకాశం కల్పిస్తారు. మెడికల్, ఇంజినీరింగ్ ఉన్నత చదువుల్లోనూ ఒక శాతం రిజర్వేషన్ ప్రభుత్వం కల్పిస్తుంది. ఎ, బి, సి మూడు సర్టిఫికెట్లు ఉన్న వారికి అధిక ప్రాధాన్యం ఉంటుంది.

**'సి' సర్టిఫికెట్ వరకు కొనసాగిస్తా**

ఎ.గోపీచంద్, ఎన్‌సీసీ క్యాడెట్, ప్రభుత్వబాలుర ఉన్నత పాఠశాల, సత్తుపల్లి

మనకు దేశం ఏమిస్తుందని కాకుండా మనం దేశానికి ఏమి ఇవ్వాలనే ఆలోచన అందరిలో ఉండాలి. ఎన్‌సీసీలో చేరి శిక్షణ పొందడం సంతోషంగా ఉంది. భవిష్యత్తులో ఏదైనా సాధించగలమనే ధైర్యం వస్తోంది. ఇక్కడితో ఆగకుండా 'సి' సర్టిఫికెట్ సాధించేవరకు శిక్షణ తీసుకుంటా.

యువతకు ఉపయుక్తం: షాకీర్ హుస్సేన్, ఎన్‌సీసీ యూనిట్ అధికారి, సత్తుపల్లి దేశ భద్రత కాపాడటంలో ముందువరుసలో ఉండేలా క్యాడెట్లను తీర్చిదిద్దుతున్నాం. దేశ భక్తితోపాటు ఇతరులను గౌరవించడం, ప్రేమ, ఆప్యాయతలు పెంపొందేలా శిక్షణలు ఇస్తున్నాం. ఏదైనా సాధించాలనే తపన, పట్టుదల వీరిలో వస్తుంది. అవకాశాలను అందిపుచ్చుకుంటూ నైపుణ్యాలను మెరుగు పరచుకునే విధంగా ఎన్‌సీసీ యువతకు ఉపయుక్తంగా ఉంటుంది.

# పక్కాగా దస్తావేజు పత్రాల లెక్క



ఖమ్మం : ఆస్తుల క్రయవిక్రయాలు సహా పలు ఆర్థిక లావాదేవీలు, ప్రమాణ పత్రాలు రాసుకునేందుకు దస్తావేజు పత్రాల(అగ్రిమెంట్ స్టాంప్ పేపర్లు) లెక్క పక్కాగా తేలనుంది. స్టాంప్ వెండర్స్ విక్రయించే దస్తావేజు పత్రాల వివరాలు కచ్చితంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సిందే. ఇందుకు అనువుగా స్టాంపు వెండర్స్‌కు ఆన్‌లైన్‌లో నమోదుపై తర్ఫీదు ఇచ్చారు. నెల రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా స్టాంపు పత్రాల విక్రయాల లెక్కలు ఆన్‌లైన్‌లో నిక్షిప్తపరుస్తున్నారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. పాత తేదీలతో స్టాంపు పత్రాలను వెండర్ల వద్ద కొనుగోలు చేయటం సాధ్యం కాదు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంస్కరణల్లో భాగంగా భూములు, స్థలాల క్రయవిక్రయాల్లో ఉపయోగించే స్టాంపు పత్రాల దుర్వినియోగానికి అడ్డుకట్ట పడింది. ఉభయ జిల్లాల్లోని స్టాంపు వెండర్స్ మొదట ఈవిధానాన్ని వ్యతిరేకించినా, తర్ఫీదు తర్వాత సులభంగా ఆన్‌లైన్‌లో నమోదుచేస్తున్నారు.

**వీటి వినియోగం అధికం**

రూ.20, రూ.50, రూ.100 ముఖ విలువ స్టాంపు పత్రాలను అధికంగా వినియోగిస్తుంటారు. ఒక రిజిస్టర్‌లో పేరు, తేదీ రాసి సంతకం తీసుకుని వెండర్స్ వీటిని ఇచ్చేవారు. కొన్నేళ్లుగా ఇదే విధానం కొనసాగుతోంది. ఇలా విక్రయించిన పత్రం ఎవరు, ఏ అవసరానికి ఉపయోగిస్తున్నారో తెలుసుకునే అవకాశం ఉండేది కాదు. తాజా పద్ధతిలో స్టాంపు పత్రంపై ముద్రించిన సంఖ్య ఆన్‌లైన్‌లో నమోదవటం వల్ల ముద్రణాలయం నుంచి రాష్ట్రం, జిల్లాకు చేరితే ఆ వివరాలు తెలుస్తాయి. జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, అక్కడి నుంచి స్టాంప్ వెండర్‌కు చేరిన పత్రాల సంఖ్యలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. చివరగా స్టాంప్ వెండర్ ఎవరికి విక్రయించారో ఆన్‌లైన్‌లో వివరాలు నిక్షిప్తపరచటం వల్ల ఆ నంబర్ పత్రం ఎక్కడుంది, ఎలా ఉపయోగించారో తెలుస్తుంది.

**మరిన్ని ఫ్రాంకింగ్ యంత్రాలు**

ఆస్తులు బ్యాంకులో తాకట్టుపెట్టి మార్ట్‌గేజ్ రుణాలు తీసుకుంటారు. ఈ సమయంలో అగ్రిమెంట్ పత్రాలపై తగు విలువతో ఫ్రాంకింగ్ యంత్రం ఉపయోగించి ముద్ర వేస్తారు. ఈ యంత్రాలు ఖమ్మంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మాత్రమే ఉండేవి. ఇటీవల కొన్ని బ్యాంకులు, చిట్‌ఫండ్ సంస్థలకు అందుబాటులోకి వచ్చాయి. యంత్రం ఉపయోగించి ఎన్ని పత్రాలపై ఎంత విలువతో ముద్రలు వేశారనే విషయం ఆన్‌లైన్ విధానంలో తెలిసిపోతుంది. మొబైల్ ఫోన్‌లో రీఛార్జ్ చేసుకున్నట్లు ముందుగా రిజిస్ట్రేషన్ల శాఖకు డబ్బు చెల్లించి యంత్రం ద్వారా ముద్రలు వేస్తుంటారు. ఆన్‌లైన్‌లో డబ్బు అయిపోతే మరోసారి రీఛార్జి చేసుకోవాలి.

స్టాంపు పత్రాల విక్రయాల వివరాలను ఆన్‌లైన్‌లో నెల రోజులుగా నమోదు చేస్తున్నాం. దీనివల్ల నకిలీ పత్రాలకు అడ్డుకట్ట పడింది. గతంలో నకిలీ పత్రాలు చెలామణిలో ఉండేవి. ప్రభుత్వ తాజా నిర్ణయంతో నకిలీ పత్రాలకు తావుండదు వెండర్స్ సులభంగా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.

అడపా రవీంద్రబాబు,జాయింట్ సబ్ రిజిస్ట్రార్-1, ఖమ్మం

# స్టేషన్‌ఘన్‌పూర్‌కు 100 పడకల ఆసుపత్రి

భూపాలపల్లి: ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న నియోజకవర్గ ప్రజల కల నెరవేరబోతోంది. అధునాతన ఆరోగ్య వైద్య సేవలు ప్రజల ముంగింట్లోకి చేరబోతున్నాయి. ప్రస్తుతం ఉన్న 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని 100 పడకల ఏరియా ఆస్పత్రిగా మారుస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. నూతన భవన నిర్మాణం, ఇతర సౌకర్యాల కల్పనకు రూ.37.50 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ఉత్తర్వులు వెలువడ్డాయి. ఏరియా ఆస్పత్రి జనగామ జిల్లా కేంద్రంలో ఉండగా ఇటీవల జనగామకు వైద్య కళాశాల మంజూరైంది. దీంతో జనగామ ఏరియా ఆస్పత్రి డీఎంఈ పరిధిలో చేరి బోధనాస్పత్రిగా మారింది. గతంలో వైద్య విధాన పరిషత్‌లో ఉన్న ఏరియా ఆస్పత్రిని మరోచోట నెలకొల్పాలని నిర్ణయించారు. ఈ క్రమంలోనే స్టేషన్‌ఘన్‌పూర్‌కు 100 పడకల ఏరియా ఆస్పత్రిని మంజూరు చేసింది. మరింత మంది వైద్యులు, నర్సింగ్ సిబ్బంది రానున్నారు. నియోజకవర్గవ్యాప్తంగా ఉన్న మండలాలతో పాటు పాలకుర్తి మండలంలోని పలు గ్రామాలకు సైతం మెరుగైన వైద్య సేవలు అందనున్నాయి. ప్రజల కోరిక నెరవేర్చేందుకు ఎమ్మెల్యే రాజయ్య చేసిన ప్రయత్నం ఫలించిందని భారాస నాయకులు పలువురు పేర్కొని ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్సీ కడియం శ్రీహరి నియోజకవర్గ ప్రజల అవసరాలు తీర్చేందుకు ప్రత్యేకంగా దృష్టిసారించి ప్రభుత్వం తరపున మంజూరు ఉత్తర్వులు ఇప్పించారని ఆ వర్గీయులు ఆయనకు అభినందనలు తెలుపుతున్నారు.

# చెరువు.. ఏదీ ఆదరవు!

భూపాలపల్లి: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో సాగునీటి పారుదల శాఖ పరిధిలోని చెరువులు, కుంటలు, చెక్ డ్యాంలకు తీవ్ర నష్టం వాటిల్లింది. నాలుగైదేళ్ల క్రితం మిషన్ కాకతీయ పథకం ద్వారా అభివృద్ధి పనులు చేపట్టినవి కూడా అధిక వర్షాల కారణంగా గండ్లు పడి నీరు అందకుండా వృథాగా పోవడంతో పలువురు అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది వర్షాలు ఆలస్యంగా రావడమే కాకుండా ఒక్కసారిగా కురిసిన వర్షాలతో చెరువులు కుంటలు కేవలం రెండు, మూడు రోజుల్లోనే మత్తళ్లు పడి చాలా వరకు కట్టలు తెగిపోయాయి. తాత్కాలిక మరమ్మతులు, శాశ్వత నిర్మాణ పనులకు సాగునీటి పారుదల శాఖ అధికారులు ప్రాథమిక అంచనాలు రూపొందించారు. జిల్లా వ్యాప్తంగా 11 మండలాల్లో మొత్తం చెరువులు, కుంటలు కలిసి 832 ఉండగా, ఇందులో 159 చెరువులకు గండ్లు పడ్డాయి. వీటికి తాత్కాలిక, శాశ్వత పనుల కోసం రూ.90 కోట్లు అవసరమని ఆ శాఖ తేల్చింది. ఇందులో చిన్నకుంటలు, చెరువులకు పడిన గండ్లు పూడ్చటానికి తాత్కాలికంగా రూ.12 కోట్లు అవసరం అవుతాయని ప్రభుత్వానికి పంపించిన నివేదికలో పేర్కొన్నారు.

**భూపాలపల్లి డివిజన్‌లోనే ఎక్కువ నష్టం**

జిల్లాలోని భూపాలపల్లి సాగునీటి పారుదల శాఖ డివిజన్ పరిధిలోనే అత్యధికంగా చెరువులు, కుంటలు దెబ్బతిన్నాయి. ఈ డివిజన్‌లో భూపాలపల్లి, చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి, రేగొండ, గణపురం, శాయంపేట మండలాల్లోనే పెద్ద మొత్తంలో గండ్లు పడ్డాయి. అత్యధికంగా వర్షపాతం నమోదు కావడం, వరద ఉద్ధృతి ఎక్కువగా ఉండడం, వరద నీరు ప్రవహించే మార్గం లేకపోవడంతో గండ్లు పడ్డాయని పలువురు సాగునీటి పారుదలశాఖ అధికారులు



చెబుతున్నారు. ఈ క్రమంలోనే జిల్లాలోని పలిమెల, మహదేవపూర్ మండలాల్లో మొత్తం 79 చెరువులుంటే ఇటీవల కురిసిన వర్షాలతో ఒక్క చెరువు కూడా తెగిపోలేదు. మహాముత్తారం, కాటారం, మల్హర్ మండలాల్లో మొత్తం చెరువులు 235 ఉన్నాయి. ఇక్కడ కేవలం మల్హర్ మండలంలోని నాచారం, తాడ్వాయి గ్రామాల్లో మూడు చెరువులు మాత్రమే గండ్లు పడ్డాయి. మిగతా చోట్ల పెద్దగా నష్టం జరగలేదు. నాలుగు రోజుల క్రితం నీటి పారుదల శాఖ ఎస్ఈ మోహన్‌రావు, ఈఈ వెంకటేశ్వర్లు, డీఈ ప్రసాద్, తదితర ఏఈలు జిల్లా వ్యాప్తంగా తెగిపోయిన చెరువులు, కుంటలను పరిశీలించిన విషయం తెలిసిందే. ఇప్పటికే గండ్లు పడిన కొన్ని చెరువులకు తాత్కాలిక మరమ్మతు పనులు చేపట్టారు.

**యుద్ధప్రాతిపదికన మరమ్మతులు**


అధిక వర్షాల కారణంగా గండ్లు పడిన చెరువులకు యుద్ధప్రాతిపదికన తాత్కాలికంగా మరమ్మతు పనులు చేపడుతాం. ఆయకట్టు రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. రెండు రోజుల క్రితమే కేంద్రం బృందం కూడా తెగిపోయిన చెరువులు, కుంటలు, చెక్ డ్యాంలను పరిశీలించి, జరిగిన నష్టం వివరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. జిల్లా వ్యాప్తంగా చెరువులు, కుంటల మరమ్మతులకు రూ.90 కోట్లతో ప్రాథమిక అంచనాలు రూపొందించాం. నిధులు విడుదల కాగానే శాశ్వత మరమ్మతు పనులు చేపడుతాం. మోహన్‌రావు, నీటిపారుదల శాఖ ఎస్ఈ, భూపాలపల్లి

# పేరుకే సంక్షేమం

భూపాలపల్లి : తెలంగాణ ప్రభుత్వం ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికలు రద్దు చేసిన తర్వాత కార్మికుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన సంక్షేమ బోర్డులు కేవలం పేరుకే పరిమితమయ్యాయి.. సంక్షేమ బోర్డు సభ్యులు సైతం తాము తోటి ఉద్యోగుల సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించలేక పోతున్నామనే ఆవేదనలో ఉన్నారు. కార్మిక సంఘాల వ్యవస్థ లేకపోవడంతో గతంలో సమ్మెలు, ధర్నాలు, నిరసనలు చేసి, యాజమాన్యంపై ఒత్తిడి పెంచే పరిస్థితి కూడా లేదు.. 2020 జనవరి 1 నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లాలో తొమ్మిది డిపోల్లో సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేశారు. ఉద్యోగుల్లో నుంచి ఇద్దరు సభ్యులు డిపో మేనేజర్ అధికారిగా ఉంటారు. ఉద్యోగులు తమ సమస్యలను సంక్షేమ బోర్డుల దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రత్యేకంగా ఫిర్యాదు పెట్టెలను ఏర్పాటు చేశారు. బోర్డు సభ్యులు ప్రతి వారం సమావేశమై ఆయా సమస్యలపై చర్చించి పరిష్కరించాలి. తమ పరిధిలో లేని వాటిని ఆర్ఎం, ఎండీ స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. పలు డిపోల్లో ఈ పెట్టెలను డీఎం కార్యాలయ సమీపంలో ఏర్పాటు చేయడంతో ఏదైనా సమస్యల పరిష్కారం కోసం ఫిర్యాదు చేయటానికి భయపడుతున్నారు. దీంతో అవి వెలవెలబోతున్నాయి. అదేవిధంగా వారానికి కాకుండా నెలకు ఒకసారి నామమాత్రంగా సమావేశాలు నిర్వహించి సంతకాలు తీసుకొని పంపిస్తున్నారని.. తమ సమస్యలు వినకుండా సంస్థ నిర్ణయాలను తెలిపేందుకు మాత్రమే సమావేశాలు నిర్వహిస్తున్నారని ఉద్యోగులు వాపోతున్నారు.

అటకెక్కిన హామీలు సమస్యలను పట్టించుకునే వారే లేకపోవడంతో ఉద్యోగులు సతమతమవుతున్నారు. సమ్మె విరమణ తర్వాత మహిళా సిబ్బంది కోసం విశ్రాంతి గదులు ఏర్పాటు చేశారు. అందులో సరైన ప్రణాళిక, వసతులు లేకుండా నిర్వహించడంతో అవి కొన్ని డిపోల్లో నిరుపయోగంగా మారుతున్నాయి. మహిళా సిబ్బందికి రాత్రి 8 గంటల్లోపు విధులు ముగించాలన్న నిబంధన ఎక్కడా అమలు కావడం లేదు.వీటిపై దృష్టి పెట్టాలి..వరంగల్ ఆర్టీసీ రీజియన్ స్థాయిలో గతంలో కార్పొరేట్ స్థాయి ఆసుపత్రుల్లో మెరుగైన ఉచిత చికిత్స అందించేది. ఇప్పుడు లేదు.సంక్షేమ బోర్డు కమిటీ సభ్యులను కేవలం డిపో పరిధిలో ఎంపిక చేశారు. కానీ రీజియన్, రాష్ట్ర స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయలేదు.మూడున్నరేళ్ల కాలం దాటిన సీఎం కేసీఆర్ సంక్షేమ బోర్డు కమిటీ సభ్యులతో ఇంతవరకు సమావేశం నిర్వహించలేదు.

కార్మికులు ప్రతి నెలా పొదుపు చేసుకున్న కో ఆపరేటివ్ బ్యాంకు(సీసీఎస్) నిధులు రూ.1050 కోట్లు యాజమాన్యం వాడుకుంది. అత్యవసరమైతే కార్మికులు సీసీఎస్ నుంచి రుణం పొందే అవకాశం లేకుండా పోయింది.నిబంధనల ప్రకారం ప్రతి రోజు అదనపు పని భారాన్ని పెంచినా, యాజమాన్యం ఓటీ చెల్లించడం లేదు. వేతనాలు, ఇతర అలవెన్స్‌లు తగ్గించారు. దీంతో కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారు. సమావేశాల జాడేది?సంక్షేమ బోర్డు కమిటీ సభ్యులను నియమించిన తర్వాత ప్రతి మూడు నెలలకోసారి సీఎం ప్రగతి భవన్‌కు పిలిచి మాట్లాడుతానన్నారు.




# సినిమాలు ఆపేసినా.. బెదిరించినా.. ఏనాడూ ఢిల్లీ పెద్దల సాయం కోరలేదు

మంగళగిరి: ఆంధ్రప్రదేశ్‌లో జనసేనకు ఇవాళ ఆరున్నర లక్షల క్యాడర్ ఉందని, యువతే పెద్ద బలమని ఆపార్టీ అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన జనసేన విస్తృత స్థాయి సమావేశంలో పవన్ పాల్గొని ప్రసంగించారు. "మన పార్టీకి యువత బలం చూసి భాజపా పెద్దలే ఆశ్చర్యపోయారు. కార్యకర్తల చిత్తశుద్ధి వల్లే జనసేనకు దిల్లీలోనూ గుర్తింపు వచ్చింది. నన్ను, నా భావజాలాన్ని నమ్మే యువత వెంట వస్తున్నారు. ఇంతమంది అభిమానుల బలం ఉందని మనకు గర్వం రాకూడదు. పొరుగు రాష్ట్రాల యువత కూడా మనకు మద్దతిస్తున్నారు. యువత ఆదరణ చూసే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో 8 చోట్ల పోటీ చేశాం. ఖమ్మం, మధిర, కూకట్‌పల్లి, దుబ్బాక ఎక్కడికెళ్లినా యువత పెద్ద ఎత్తున తరలివచ్చి మద్దతిచ్చారు" "వైకాపాకు భావజాలం లేదు. ఎందుకోసం పనిచేస్తున్నారో వారికే తెలియదు. అన్న ముఖ్యమంత్రి కావాలి.. అందుకోసం పనిచేస్తున్నాం అని చెబుతారు. నేను ఏం చేసినా దేశ సమగ్రత గురించే ఆలోచిస్తా. సమాజాన్ని ఎలా చూస్తామనే దానిపై జనసేనలో స్పష్టమైన అవగాహన ఉంది. హైదరాబాద్‌లో యువత ఓటింగ్‌కు దూరంగా ఉండటం చాలా బాధ కలిగించింది.

నా సినిమాలు ఆపేసినా, నేను బసచేసిన హెూటల్‌కు వచ్చి బెదిరించి ఇబ్బంది పెట్టినా.. మన పోరాటం మనమే చేసుకున్నాం తప్ప ఏనాడూ జాతీయ స్థాయి నాయకుల వద్దకు వెళ్లి మీ సహాయం కావాలని చేయిచాచి అడగలేదు. ఎందుకంటే ఇది మన నేల.. మన పోరాటం. కుదిరితే మనం వారికి బలం అవ్వాలి. కానీ, మనం బలం చూపించకపోతే వాళ్లు గుర్తింపు ఇవ్వరు. పోరాటం చేసే వాళ్లనే వారు గుర్తిస్తారు. స్వార్థం వదిలేయాలని నాయకులను కోరుతున్నా. చేసే పని, పోరాటమే మనకు గుర్తింపు ఇస్తుంది" అని పార్టీ శ్రేణులకు పవన్ దిశానిర్దేశం చేశారు.

**వైకాపా నేతలు వేసే కులాల ఉచ్చులో చిక్కుకోవద్దు..** వైకాపా నేతలు వేసే కులాల ఉచ్చులో చిక్కుకోవద్దని పార్టీ శ్రేణులకు పవన్ కల్యాణ్ సూచించారు. ఏపీ సుస్థిరత, సమైక్యత, అభివృద్ధి కోసమే తెలుగుదేశం పార్టీతో పొత్తు పెట్టుకున్నామన్న ఆయన.. పొత్తు గురించి వ్యతిరేకంగా మాట్లాడేవారు వైకాపా కోవర్టులేనన్నారు. "నేను మొదటినుంచి పదవులు కోరుకోలేదు. నిస్సహాయ స్థితిలో ఉన్న ప్రజలకు సేవచేయాలని అనుకున్నా. స్థానిక సంస్థల ఎన్నికల్లో తెదేపా, జనసేన కలిసి పనిచేశాయి. వైకాపాను తట్టుకునేందుకు కలిసి పనిచేస్తున్నామని వాళ్లు చెప్పారు. మెగాస్టార్, సూపర్ స్టార్‌ను కూడా వీళ్లు బెదిరిస్తారు. అవమానం జరిగినా.. దెబ్బపడినా ఎప్పటికీ మరిచిపోను. ఒక కులం మీద రాజకీయాలు నడపలేం..సాధ్యం కాదు. ఓడిపోయినప్పుడు మనకు అండగా ఎవరుంటారు అనేదే ముఖ్యం. పార్టీ నుంచి వెళ్లిపోతామని అనేకమంది బెదిరించారు. ఇష్టం లేకుంటే వెళ్లిపోవాలని ఆ నాయకులకు చెప్పా. మాకు ప్రజలు ముఖ్యం నాయకులు కాదు. మనం తెదేపా వెనుక నడవడం లేదు.. కలిసి నడుస్తున్నాం. షణ్ముక వ్యూహంతో చెప్పినవన్నీ అమలు చేస్తాం" అని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.



# సాగర్ నుంచి నీరు తీసుకోవడం ఆపాలి: ఏపీ ప్రభుత్వానికి కేఆర్ఎంబీ లేఖ

హైదరాబాద్: నాగార్జునసాగర్ కుడి కాలువ నుంచి నీరు తీసుకోవడం ఆపాలని ఏపీ ప్రభుత్వాన్ని కృష్ణా బోర్డు (కేఆర్ఎంబీ) ఆదేశించింది. ఈ మేరకు ఏపీ జలవనరుల శాఖ ముఖ్యకార్యదర్శికి కేఆర్ఎంబీ సభ్య కార్యదర్శి లేఖ రాశారు. అక్టోబర్ నెల కోసం అడిగిన 5 టీఎంసీల నీటిలో ఇప్పటికే 5.01 టీఎంసీల నీటిని విడుదల చేసినట్లు లేఖలో పేర్కొన్నారు. నవంబర్ 30వ తేదీ తర్వాత నీటి విడుదలపై ఏపీ ప్రభుత్వం నుంచి ఎలాంటి వినతి అందలేదని స్పష్టం చేశారు. అయితే కేఆర్ఎంబీ ఆదేశాలు ఏపీ ప్రభుత్వం ఇప్పటి వరకు పట్టించుకోలేదు. ఏపీ వైపు కుడి కాలువ నుంచి ఇంకా నీటి విడుదల కొనసాగుతోంది. మరో వైపు నల్గొండ జిల్లా నాగార్జునసాగర్ డ్యామ్ వద్ద పోలీసు పహారా కొనసాగుతోంది. ముళ్లకంచెల నడుమ సాగర్ డ్యామ్‌పై పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఏపీ వైపు భారీగా పోలీసులు మోహరించారు. ఆ రాష్ట్రానికి చెందిన సుమారు 1200 మంది పోలీసులు అక్కడ ఉన్నారు. తెలంగాణ పోలీసులు కూడా అక్కడికి పెద్ద ఎత్తున చేరుకున్నారు. కృష్ణా బోర్డు అధికారులు సాగర్ వద్దకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

**వివాదానికి కారణమేంటి? :** రాష్ట్ర విభజన సమయంలో కృష్ణా, గోదావరి నదీ బోర్డులు ఏర్పాటయ్యాయి. ఆ సమయంలో శ్రీశైలం జలాశయాన్ని ఆంధ్రప్రదేశ్, నాగార్జునసాగర్‌ను తెలంగాణ నిర్వహించాలనే నిర్ణయం వెలువడింది. ఈ నిర్ణయం సరిగా అమలు కాలేదు. శ్రీశైలం జలాశయంలో ఎడమ విద్యుత్తు కేంద్రం, తదితరాలను తెలంగాణ రాష్ట్రమే నిర్వహించుకుంటోంది. అటువైపు ఆంధ్రప్రదేశ్ అధికారులను రానివ్వడం లేదు. అదే సమయంలో నాగార్జునసాగర్ ప్రాజెక్టులో 26 గేట్లకు 13 గేట్లు ఆంధ్రప్రదేశ్ భూభాగంలో ఉంటాయి. కుడి కాలువ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు నీళ్లు కూడా తెలంగాణ అధికారులే విడుదల చేస్తున్నారు. గతంలో కృష్ణా బోర్డు ఆదేశాలు ఇచ్చినా నీళ్లు విడుదల చేయని సందర్భాలు ఉండేవి. తాజాగా ఇలాంటి సమస్యలేవీ తలెత్తలేదు. ఈ నెలలో సాగర్ కుడికాలువ నుంచి నీళ్లు విడుదల చేయాలని తెలంగాణ అధికారులకు ఆంధ్రప్రదేశ్ ఇండెంటు పంపిన దాఖలాలూ లేవు. నీటి విడుదలకు ఈ రెండు నెలల్లో ఎలాంటి ఇబ్బందులూ రాలేదు. ఉమ్మడి జలాశయాలను బోర్డుల పరిధిలోకి తీసుకురావాలని ఎప్పటి నుంచో ఆంధ్రప్రదేశ్ డిమాండు చేస్తోంది.



# కాకినాడ తీరంలో.. బోటులో చెలరేగిన మంటలు

## బోటులో అగ్నిప్రమాదం.. కోస్టుగార్డు రెస్క్యూ ఆపరేషన్

కాకినాడ: కాకినాడ తీరంలో వేటకు వెళ్తున్న బోటులో అగ్నిప్రమాదం జరిగింది. నడి సంద్రంలో ఉండగా అందులోని గ్యాస్ సిలిండర్ పేలింది. దీంతో మంటలు వ్యాపించాయి. 11 మంది మత్స్యకారులు బోటులో చిక్కుకున్నారు.

వారు వెంటనే కాకినాడ తీరంలో గస్తీ నిర్వహిస్తున్న కోస్ట్‌గార్డు సిబ్బందికి సమాచారం చేరవేశారు. దీంతో సిబ్బంది రెస్క్యూ ఆపరేషన్ చేపట్టి మత్స్యకారులను కాపాడారు.

మత్స్యకారులు చేపలవేటకు వెళ్లే సమయంలో భోజన అవసరాల కోసం నిత్యావసరాలు, గ్యాస్ సిలిండర్ తదితర వస్తువులను వెంట తీసుకెళ్తుంటారు. వేటకు విరామం ఇచ్చే సమయంలో బోటులో వంట చేసుకుని భోజనం చేస్తారు. ఎప్పటిలాగే అలా వెళ్లిన 11 మంది మత్స్యకారులు తిరిగి వస్తుండగా బోటులో గ్యాస్ సిలిండర్ పేలి పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. కోస్టు గార్డు సిబ్బందికి వెంటనే సమాచారం ఇవ్వడం.. వారు వెంటనే స్పందించి రెస్క్యూ ఆపరేషన్ చేపట్టడంతో పెను ప్రమాదం తప్పింది. లేదంటే మత్స్యకారులు మంటల్లో చిక్కుకోవడమో.. లేక వాటి తీవ్రతకు సముద్రంలో దూకి ప్రాణాలు కోల్పోవడమో జరిగేది. మధ్యాహ్నం తర్వాత మత్స్యకారులు ఒడ్డుకు చేరుకునే అవకాశముంది.



# బెంగళూరులో 40కి పైగా స్కూళ్లకు బాంబు బెదిరింపు

బెంగళూరు: కర్ణాటక రాజధాని బెంగళూరులోని పదుల సంఖ్యలో పాఠశాలలకు శుక్రవారం ఉదయం బాంబు బెదిరింపులు రావడం తీవ్ర కలకలం రేపుతోంది. గుర్తుతెలియని ఒక ఈ మెయిల్ అడ్రస్ నుంచి ఈ బెదిరింపులు వచ్చాయని పోలీసులు తెలిపారు. పాఠశాలల్లోనే బాంబులు పెట్టామని సదరు ఈ మెయిళ్లలో పేర్కొనడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వణికిపోయారు. నేటి ఉదయం తొలుత ఏడు ప్రైవేటు స్కూళ్లకు ఈ బెదిరింపు మెయిళ్లు రాగా.. ఆ తర్వాత కొద్దిసేపటికే మరికొన్ని విద్యాసంస్థలకు అదే తరహాలో బెదిరింపులు వచ్చాయి. తొలుత ఆ సంఖ్య 15 అని ఉండగా.. తర్వాత 44కు చేరింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర ఆందోళన వ్యక్తం అవుతోంది. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు.. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా విద్యార్థులు, ఉపాధ్యాయులను పాఠశాలలను నుంచి బయటకు పంపించారు. తర్వాత వారు బాంబ్‌స్క్వాడ్ తనిఖీలు చేపట్టింది. వైట్‌ఫీల్డ్, కొరమంగళ, బసవేశ్వరనగర్, యెలహంక, సదాశివనగర్‌లోని పాఠశాలలకు ఈ బెదిరింపులు వచ్చాయి. ఒక స్కూల్ కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ నివాసానికి అతి సమీపంలోని పాఠశాలకు కూడా ఈ మెయిల్ రాగా.. ఆయన స్వయంగా అక్కడకు వెళ్లి దానిని పరిశీలించారు. ఈ క్రమంలో ఒక పాఠశాల విద్యార్థి తల్లిదండ్రులకు అడ్వైజరీ జారీ చేసింది. 'ఈ రోజు మన పాఠశాల అనూహ్య పరిస్థితిని ఎదుర్కొంది. గుర్తుతెలియని వర్గాల నుంచి ఒక మెయిల్ వచ్చింది. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకొని.. తక్షణమే వారిని ఇళ్లకు పంపివేయాలని నిర్ణయించుకున్నాం' అని పేర్కొంది.

గత ఏడాది కూడా బెంగళూరులోని ఏడు పాఠశాలలకు ఇలాంటి బెదిరింపులే వచ్చాయి. అయితే, తర్వాత అవి నకిలీ బెదిరింపులని తేలింది. ప్రస్తుత బెదిరింపులపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇవి కూడా నకిలీ బెదిరింపులే అయి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే, ఈ మెయిళ్లు పంపిన వారి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. మరోవైపు బెదిరింపులు వచ్చిన పాఠశాలల సంఖ్య పెరగడం ఆందోళన కలిగిస్తోంది.

# సీబీఐ కోర్టులో లొంగిపోయిన వైఎస్ భాస్కర్‌రెడ్డి



హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో నిందితుడు వైఎస్ భాస్కర్‌రెడ్డికి ఇచ్చిన ఎస్కార్ట్ బెయిల్ గడువు ముగిసింది.

అనారోగ్యం దృష్టిలో ఉంచుకుని భాస్కర్‌రెడ్డికి సీబీఐ కోర్టు ఎస్కార్ట్ బెయిల్ మంజూరు చేసింది. దీంతో ఆయన సెప్టెంబరు 22 నుంచి నవంబరు 30 వరకు ఎస్కార్ట్ బెయిల్‌పై ఉన్నారు. గడువు ముగియడంతో శుక్రవారం సీబీఐ కోర్టులో లొంగిపోయారు. ఈనెల 20 వరకు సీబీఐ కోర్టు రిమాండ్ విధించడంతో సీబీఐ అధికారులు భాస్కర్‌రెడ్డిని చంచల్‌గూడ జైలుకు తరలించారు.

# అధికారంలోకి వచ్చాక అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయంచేస్తాం

కాకినాడ: టీడీపీ యువనేత నారా లోకేష్‌ను అగ్రిగోల్డ్ బాధితులు కలిశారు. అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలపై లోకేష్ స్పందిస్తూ సీఎం జగన్‌పై విమర్శలు గుప్పించారు. "మాటతప్పడం, మడప తిప్పడం జగన్మోహన్ రెడ్డికి వెన్నతో పెట్టిన విద్య. అగ్రిగోల్డ్ బాధితులకు ఇప్పటికీ న్యాయం జరగకపోవడం దురదృష్టకరం. టీడీపీ అధికారంలోకి వచ్చాక చట్టపరిధిలో అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయంచేస్తాం." అని లోకేష్ హామీ ఇచ్చారు. లోకేష్ యువగళం పాదయాత్ర తూర్పుగోదావరి జిల్లాలో కొనసాగుతోంది. పాదయాత్రలో భాగంగా కాకినాడలో లోకేష్‌ను దివ్యాంగుల జేఏసీ ప్రతినిధులు కలిసి సమస్యలు చెప్పుకున్నారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. జగన్ అధికారంలోకి వచ్చాక విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేశారన్నారు. దివ్యాంగులపై కనీసం మానవత్వం లేకుండా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. గత నాలుగున్నరేళ్లలో ఒక్కరికి కూడా మూడు చక్రాల మోటార్ సైకిల్, పనిముట్లు ఇవ్వలేదన్నారు. స్వయం ఉపాధికి సంబంధించిన సబ్సిడీ లోన్లు మంజూరు చేయకుండా



ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక దివ్యాంగుల హక్కుల చట్టం అమలుకు చర్యలు తీసుకుంటామన్నారు. దివ్యాంగులకు విదేశీవిద్య, చంద్రన్న పెళ్లికానుక అమలు చేస్తామన్నారు. దివ్యాంగులపై దాడులకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని లోకేష్ హెచ్చరించారు.

# వైకుంఠద్వార దర్శనానికి విస్తృత ఏర్పాట్లు: ఈవో ధర్మారెడ్డి



తిరుమల: కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి వైకుంఠ ద్వార దర్శనానికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) ఈవో ధర్మారెడ్డి తెలిపారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ ఏడాది డిసెంబరు 23వ తేదీ నుంచి జనవరి 1వ తేదీ వరకు 10 రోజుల పాటు భక్తులకు శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనాన్ని కల్పించనున్నట్లు ఈవో చెప్పారు. ఈ సందర్భంగా డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో ధర్మారెడ్డి పలు కీలక విషయాలు వెల్లడించారు. భక్తులు క్యూలైన్లలో చలికి ఇబ్బందులు పడుతూ ఎక్కువ సమయం వేచి ఉండడాన్ని నివారించేందుకు గాను టైంస్లాట్ టోకెన్లు జారీ చేస్తున్నట్లు చెప్పారు. **ఈవో వెల్లడించిన మరిన్ని కీలక విషయాలు..** తిరుపతి, తిరుమలలోని 10 కేంద్రాల్లో ఏర్పాటు చేసిన 94 కౌంటర్ల ద్వారా డిసెంబరు 22 నుంచి 4,23,500 టోకెన్లు జారీ చేస్తాం. తిరుపతిలోని ఇందిరా మైదానం, రామచంద్ర పుష్కరిణి, శ్రీనివాసం కాంప్లెక్స్, విష్ణునివాసం కాంప్లెక్స్, భూదేవి కాంప్లెక్స్, శ్రీగోవిందరాజస్వామి రెండో సత్రం, బైరాగిపట్టెడలోని రామానాయుడు ఉన్నత పాఠశాల, ఎంఆర్ పల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జీవకోనలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తిరుమలలో స్థానికుల కోసం కౌస్తుభం విశ్రాంతి గృహం వద్ద టోకెన్ కౌంటర్లు ఏర్పాటు చేస్తాం. దర్శనానికి టోకెన్లు తీసుకున్న భక్తులను మాత్రమే తిరుమల శ్రీవారి దర్శనానికి అనుమతిస్తాం. డిసెంబరు 22 నుంచి 24 వరకు, డిసెంబరు 31, జనవరి 1వ తేదీల్లో కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం సేవలను రద్దు చేస్తున్నాం. ఈ సేవలను డిసెంబరు 25 నుంచి 30వ తేదీ వరకు ఏకాంతంగా నిర్వహిస్తాం. డిసెంబరు 23 నుంచి జనవరి 1వ తేదీ వరకు సహస్రదీపాలంకార సేవను ఏకాంతంగా నిర్వహిస్తాం. వైకుంఠ ఏకాదశి పర్వదినం రోజు ఉదయం 9 నుంచి 11 గంటల వరకు శ్రీదేవిభూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారు స్వర్ణరథంపై ఆలయ మాడవీధుల్లో భక్తులకు దర్శనమిస్తారు. వైకుంఠ ద్వాదశి సందర్భంగా ఉదయం 4.30 నుంచి 5.30 గంటల మధ్య చక్రస్నానం నిర్వహిస్తాం. నాదనీరాజనం వేదికపై ఏకాదశి రోజున విష్ణుసహస్రనామ పారాయణం ఉంటుంది. అదేరోజు గీతాజయంతి రావడంతో భగవద్గీత అఖండపారాయణం నిర్వహిస్తాం. తిరుపతిలోని ఎస్వీ వేద విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఉన్న ధ్యానారామంలో నవంబరు 14న ప్రారంభమైన రుద్రాభిషేకం డిసెంబరు 12వ తేదీ వరకు కొనసాగుతుంది. తిరుమల శ్రీవారి ఆలయంలో డిసెంబరు 12వ తేదీ నుంచి అధ్యయనోత్సవాలు ప్రారంభమవుతాయి. ధనుర్మాసంలో వైకుంఠ ఏకాదశికి 11 రోజులు ముందు నుంచి శ్రీవారి సన్నిధిలో అధ్యయనోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. డిసెంబరు 17 నుంచి జనవరి 14వ తేదీ వరకు ధనుర్మాసం కావడంతో ఉదయం సుప్రభాత సేవ స్థానంలో తిరుప్పావై పఠనం జరుగుతుంది. తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో డిసెంబరు 23న గీతాజయంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తాం. ఈ సందర్భంగా విద్యార్థులకు భగవద్గీత పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేస్తాం. 2024 సంవత్సరం డైరీలు, క్యాలెండర్లు తిరుమల, తిరుపతితో పాటు చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, విజయవాడ, వైజాగ్‌లోని శ్రీవారి ఆలయాలు, ముంబయి, దిల్లీ, వేలూరు, కాంచీపురంలోని సమాచార కేంద్రాలు, నెల్లూరు, రాజమహేంద్రవరం, కాకినాడ, కర్నూలులోని తితిదే కల్యాణమండపాల్లో అందుబాటులో ఉన్నాయి. తిరుమలలో గదులు పొందిన భక్తులు కాషన్ డిపాజిట్ ప్రస్తుత స్థితిని తెలుసుకునేందుకు తితిదే వెబ్‌సైట్‌లో కాషన్ డిపాజిట్ రీఫండ్ ట్రాకర్‌ను పొందుపరిచాం.

# ఏపీకి తుపాను ముప్పు.. రెండు రోజుల్లో అతి భారీ వర్షాలు




అమరావతి: ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం వాయుగుండంగా మారింది. రేపటికి తీవ్రవాయుగుండంగా, ఎల్లుండికి తుఫానుగా మారే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. సోమవారం సాయంత్రం చెన్నై- మచిలీపట్నం మధ్య తీరం దాటే అవకాశం ఉందని, దీని ప్రభావంతో ఆదివారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు, అక్కడక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. రైతులు వ్యవసాయపనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, మత్స్యకారులు వేటకు వెళ్లరాదని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల సంస్థ మేనేజింగ్ డా. అంబేద్కర్ వెల్లడించారు.

## తడిసిన అందాలతో ప్రియా ప్రకాశ్ వయ్యారాల వల

కొంటెగా కన్నుగీటి ఓవర్‌నైట్‌లోనే స్టారైన మలయాళీ ముద్దుగుమ్మ ప్రియా ప్రకాశ్ వారియర్ అనతికాలంలోనే ఎక్కువమంది అభిమానులను సొంతం చేసుకున్నారు. సౌత్ ఇండస్ట్రీలో గ్లామర్ బ్యూటీగా మంచి గుర్తింపు దక్కించుకున్న ప్రియా ప్రకాశ్.. ప్రస్తుతం హిందీలో వరుస చిత్రాల్లో చేస్తున్నారు. సోషల్ మీడియాలోనూ హాట్ ఫొటోస్‌తో కవ్వించే ఈ ముద్దుగుమ్మ తాజాగా ట్రెడిషనల్ లుక్‌లో తడిసిన అందాలతో హీట్ పుట్టించేసింది. ఈ ముద్దుగుమ్మ తెలుగులోనూ పలు సినిమాల్లో నటించంది. కానీ ఈమెకు అదృష్టం కలిసి రాక ఇంత వరకు సరైన హిట్ అందుకోలేదు. చెక్, ఇష్క్ : నాట్ ఏ లవ్ స్టోరీతో పాటు ఇటీవలే పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ బ్రో



సినిమాలో సాయి ధరమ్ తేజ్ చెల్లెలి పాత్రలో కనిపించి ఆకట్టుకుంది. ఇతర భాషల్లోనూ చాలానే చిత్రాలు చేసింది. మలయాళంలో '4 ఇయర్స్', 'లైవ్', 'కొళ్ల', 'సుభద్రహరణం' వంటి సినిమాల్లో తనదైన నటనతో ఆకట్టుకుంది. ముఖ్యంగా హిందీలో కాస్త జోరు చూపిస్తోంది. 'యారియాన్ 2' చిత్రంతో ఆరంగేట్రం చేసిన ఈమె.. మూడు చిత్రాలను లైన్‌లో పెట్టింది. హిందీలో 3 మంకీస్, లవ్ హ్యాకర్స్, శ్రీదేవి బంగ్లా అనే సినిమాలు చేస్తోంది. కన్నడలోనూ విష్ణుప్రియా అనే చిత్రం చేస్తోంది. సోషల్ మీడియాలోనూ ఈ ముద్దుగుమ్మ మొదటి నుంచి స్టన్నింగ్ హాట్ ఫొటోషూట్లు చేస్తూ కవ్విస్తుంటుంది. ట్రెండీ వేర్ ఔట్ ఫిట్లలో యూత్‌ను బాగా ఆకర్షిస్తుంటుంది. ఫ్యాషన్ సెన్స్ బాగుంటుంది. తాజాగా ఈ బ్యూటీ చీరకట్టులో ట్రెడిషనల్ ఫొటోషూట్ చేసింది. క్రీమ్ కలర్ చీరను ధరించి... నదిలో జలకాలాడుతూ ఫొటోలకు పోజులిచ్చింది. ఒంపుసొంపులతో మెస్మరైజ్ చేసింది. నడుము అందాలను హైలైట్ చేస్తూ బాగా కవ్వించింది. తడి అందాలతో ఆమెను చూసిన నెటిజన్లు, ఫ్యాన్స్ పోజులు అదిరాయి అంటూ విపరీతంగా కామెంట్లు చేస్తున్నారు. ఆ పిక్స్‌ను తెగ షేర్ చేస్తూ ఆస్వాదిస్తున్నారు. హార్ట్, లవ్ అండ్ హాట్ ఎమోజీలతో కామెంట్ సెక్షన్‌ను నింపేస్తూ ట్రెండ్ చేస్తున్నారు.

## 200 కోట్ల ఆస్తితో అత్యంత ధనిక భారతీయ గాయని

భారతదేశంలో ఎందరో గొప్ప గాయనీమణులు ఉన్నారు. దశాబ్దాల పాటు తమ గానంతో ప్రపంచవ్యాప్తంగా అసాధారణ ఫాలోవర్లను సంపాదించుకున్నారు. అభిమానమే చాలా మందికి సంపద. శ్రేయా ఘోషల్, సునిధి చౌహాన్, నేహా కక్కర్ ఇప్పుడు భారతదేశంలోని అగ్రశ్రేణి మహిళా గాయకులుగా రికార్డుల్లో ఉన్నారు. లెజెండరీ ఆశా భోంస్లే దశాబ్దాలుగా పాడుతున్నారు. భారతీయ సంగీత పరిశ్రమలో ఆమె తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకున్నారు. ఈ గాయకులందరూ చాలా డబ్బు, కీర్తిని సంపాదించడంలో విజయం సాధించారు. అయితే భారతదేశంలో అత్యంత ధనిక మహిళా గాయని ఎవరు? అంటే ఆ పేరు ఇప్పటివరకూ మిస్టీరియస్ అని చెప్పాలి.



బయటి ప్రపంచానికి అంతగా తెలియని యువ గాయని ప్రముఖ గాయనీమణులందరి కంటే ముందుంది. మనం మాట్లాడుకుంటున్న గాయని తులసి కుమార్. రూ. 200 కోట్ల నికర ఆస్తి విలువతో భారతదేశంలోనే అత్యంత ధనిక మహిళా గాయని. తులసి కుమార్ ప్రముఖ సినీ నిర్మాత భూషణ్ కుమార్ సోదరి. దివంగత గాయకుడు టి-సిరీస్ వ్యవస్థాపకుడు గుల్షన్ కుమార్ కుమార్తె. తన సోదరి కుశాలి కుమార్ నటి. తులసి కుమార్ నికర ఆస్తి విలువ నేటితరం ట్యాలెంటెడ్ యువగాయనీమణులు శ్రేయా ఘోషల్, సునిధి చౌహాన్, నేహా కక్కర్ మొదలైన వారి మొత్తం సంపద కంటే చాలా ఎక్కువ. తులసి కుమార్ 2009లో 'లవ్ హెూ జాయే' ఆల్బమ్‌తో గాయనిగా కెరీర్ ప్రారంభించారు. అనేక సినిమాలకు పాడారు.

వాటిలో స్కూల్ లోని ముఝే తేరీ.. బిల్లు లోని 'లవ్ మేరా హిట్'.. వన్స్ అపాన్ ఎ టైమ్ ఇన్ ముంబై లోని 'తుమ్ జో ఆయే' లాంటి చార్ట్ బస్టర్ పాటలు ఉన్నాయి. 37 ఏళ్ల గాయని హితేష్ రాల్హాన్‌ను 2015లో వివాహం చేసుకున్నారు. శ్రేయా ఘోషల్ నికర ఆస్తి విలువ రూ. 180-185 కోట్లు. సునిధి చౌహాన్ నికర ఆస్తి విలువ రూ. 100 కోట్లకు పైగా ఉండగా, ఆశా భోంస్లే నికర ఆస్తుల విలువ రూ. 80 కోట్లకు పైగా ఉన్నట్లు కథనాలొస్తున్నాయి. సింగింగ్ సెన్సేషన్ నేహా కక్కర్ ఆస్తి విలువ దాదాపు రూ.40 కోట్లు అని సమాచారం. వీళ్లందరి కంటే తులసి కుమార్ ఆస్తి విలువ ఎక్కువ.




# 10 రోజులు మైసూర్ లో..రేయింబవళ్లు గేమ్ ఛేంజర్!



గేమ్ ఛేంజర్ షూటింగ్ నత్తనడకన సాగుతోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే షూటింగ్ పూర్తి కావాల్సిన సినిమా ఇంకా సెట్స్ లో నే ఉంది. అందుకు కారణాలు అనేకం. ఏక కాలంలో భారతీయుడు -2 చిత్రీకరణ కూడా జరగడంతో శంకర్ రెండిటినీ బ్యాలెన్స్ చేసుకుంటూ వెళ్లడంతో! డిలే తప్పలేదు. మూడు రోజుల క్రితం వరకూ శంకర్ భారతీయుడు-2 సెట్స్ లోనే ఉన్నారు. విజయవాడలో కీలక యాక్షన్ సన్నివేశాలు కొన్నింటిని చిత్రీకరించారు. తాజాగా కమల్ హాసన్ కి విశ్రాంతి ఇచ్చి మళ్లీ రామ్ చరణ్ ని సెట్స్ కి పిలిచారు. నిన్నటి రోజున చరణ్ మైసూర్ చేరుకున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం అక్కడ షూటింగ్ జరుగుతోంది. తాజాగా సెట్స్ నుంచి మరిన్ని విషయాలు లీకయ్యాయి. పదిరోజుల పాటు ఏకధాటిగా మైసూర్ లోనే షూటింగ్ జరుగుతుంది. ప్రస్తుతం చరణ్..సునీల్ పై శంకర్ కీలక సన్నివేశాలుచిత్రీకరిస్తున్నట్లు తెలిసింది. పదిరోజులే షూటింగ్ కి కేటాయించడంతో రేయింబవళ్లు షూటింగ్ చేస్తున్నారుట. రాత్రిపూట చిత్రీకరణకు ఆటంకాలు కూడా తక్కువగా ఉండటంతో చకాచకా పూర్తిచేస్తున్నారుట. అయితే అవి నైట్ ఎఫెక్ట్ కి సంబంధించిన సన్నివేశాలా? లేక డే అంతా షూటింగ్ చేసినా సమయాభావంతో రాత్రిపూట కూడా చేస్తున్నారా? అన్నది క్లారిటీ లేదు. కానీ డే షూట్ కన్నా నైట్ షూట్ బాగా వస్తుందని లీకులందు తున్నాయి. మొత్తానికి మైసూర్ షూట్ వేగంగానే జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇందులో రామ్ చరణ్ కి జోడీగా కియారా అద్వాణీ నటిస్తోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే కియారాపై కొన్ని కీలక సన్నివేశాలు చిత్రీకరించారు. మరి మైసూర్ షూట్ లో ఆమెకేమైనా సన్నివేశాలున్నాయా? లేదా? అన్నది తెలియాల్సి ఉంది. ఈ చిత్రాన్ని దిల్ రాజు భారీ బడ్జెట్ తో నిర్మిస్తోన్న సంగతి తెలిసిందే.

# ఆమెజాన్ ప్రైమ్ వీడియో 'దూత' ట్రైలర్.. ఎలా ఉందంటే..




అక్కినేని యంగ్ హీరో నాగచైతన్య డిజిటల్ ప్లాట్ ఫామ్ లో అడుగుపెడుతూ నటించిన మొదటి వెబ్ సిరీస్ 'దూత'. ఇష్క్, మనం, 24 వంటి సినిమాలను డైరెక్ట్ చేసిన విక్రమ్ కే కుమార్ ఈ వెబ్ సిరీస్ ని తెరకెక్కించారు. ఈరోజు చైతు బర్త్ డే కావడంతో దూత వెబ్ సిరీస్ ట్రైలర్ ని రిలీజ్ చేశారు. తాజాగా విడుదలైన ఈ ట్రైలర్ అభ్యంతం ఆకట్టుకుంది. దూత ఇదొక క్రైమ్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్. ఇందులో చైతు జర్నలిస్టుగా నటించాడు. ఇలాంటి జోనర్ లో చైతు గతంలో ఎప్పుడు సినిమా చేయలేదు. కానీ తాజాగా విడుదలైన ట్రైలర్ చూస్తే చైతు తన పాత్రకి పూర్తి న్యాయం చేసినట్లు కనిపించాడు. ముఖ్యంగా ట్రైలర్ లో టెరిఫిక్ గా కనిపించాడు. డైరెక్టర్ విక్రమ్ కె కుమార్ ఈ క్రైమ్ థ్రిల్లర్ లో నాగచైతన్య ని సరి కొత్తగా ప్రజెంట్ చేశాడు. జర్నలిస్ట్ అయిన నాగ చైతన్య "మేము మెసెంజర్స్ తెలుగులో చెప్పాలంటే దూతలు" అనే డైలాగ్ హైలెట్ గా నిలిచింది. ముఖ్యంగా ట్రైలర్ లో విజువల్స్ అండ్ బీజీయం హైలెట్ గా నిలిచాయి. సుమారు 2 నిమిషాల 24 సెకండ్ల నిడివి ఉన్న ఈ ట్రైలర్ లో క్రైమ్ ఇన్వెస్టిగేషన్ షాట్స్ ఎక్కువగా చూపించారు. దీన్నిబట్టి సినిమా అంతా ట్విస్టులు, సస్పెన్స్ లతోనే ఉండబోతుందని అర్థమవుతుంది. నాగ చైతన్య తనకి సంబంధం లేని ఓ క్రైమ్ లో ఇరుక్కున్నట్టుగా ట్రైలర్ లో చూపించారు.. అలాగే దర్శకుడు విక్రమ్ కె కుమార్ చూపించిన సస్పెన్స్ ఫ్యాక్టర్ అయితే థ్రిల్లింగ్ గా అనిపించింది. అలాగే తన పాత్రలో చైతు చాలా పర్ఫెక్ట్ గా సెట్ అయ్యాడు. ఇందులో చైతూకి ఓ గతం ఉన్నట్లు కూడా కొన్ని షాట్స్ చూపించారు. దీన్నిబట్టి జరుగుతున్న పరిణామాలకి చైతూ గతానికి లింక్ ఉన్నట్లు కొంత హిట్ ఇచ్చారు. ఇలాంటి జర్నలిజం బ్యాక్ డ్రాప్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్స్ హిందీలో ఎక్కువగా వచ్చేవి. కానీ మొదటిసారి విక్రమ్ కె కుమార్ ఇలాంటి ఓ జోనర్ ని తెలుగు ఆడియన్స్ కి అందించబోతున్నారు. ట్రైలర్ అయితే చాలా ప్రామిసింగ్ గా అనిపించింది. డిసెంబర్ 1 నుంచి అమెజాన్ ప్రైమ్ లో దూత సిరీస్ స్ట్రీమింగ్ అవ్వనుంది. తెలుగుతోపాటు హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ వెబ్ సిరీస్ అందుబాటులోకి రానుంది. కాగా ఈ వెబ్ సిరీస్ ఎన్ని ఎపిసోడ్స్ తో ఉంటుందనేది తెలియాల్సి ఉంది. దర్శకుడు విక్రమ్ కె కుమార్ సూపర్ నేచురల్ థ్రిల్లర్లను తీయడంలో నిపుణుడు. ట్రైలర్ ప్రారంభం నుండి చివరి వరకు మనల్ని కట్టిపడేసేలా తన మార్క్ చూపించాడు. ఇక నాగ చైతన్య పరిశోధనాత్మక జర్నలిస్ట్ పాత్రలో మెరిశాడు. ధూత సాంకేతికంగా అత్యున్నత స్థాయి విజువల్స్ మరియు అద్భుతమైన బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ తో ఆకట్టుకుంటోంది. ట్రైలర్‌తో సిరీస్‌పై అంచనాలు భారీగా పెరిగాయి. దర్శకుడు విక్రమ్ కుమార్ మాట్లాడుతూ "ధూత అంటే 'ది మెసెంజర్', అనూహ్యత. అలాగే అతీంద్రియ అంశాల యొక్క అద్వితీయమైన సమ్మేళనంతో కూడిన సస్పెన్స్ థ్రిల్లర్.

ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. ఈ సిరీస్ భారతదేశంలోనే కాకుండా 240 దేశాలకు చెందిన ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. ప్రైమ్ వీడియోలో వస్తున్న ది బెస్ట్ సిరీస్ ఇది ఒకటి అన్నారు.

## షార్ట్ టాప్‌లో అల్ట్రా స్టైలిష్ అనసూయ

యాంకర్ కమ్ యాక్టర్ అనసూయ ప్రస్తుతం ఇండస్ట్రీలో హాట్ గ్లామర్‌కు కేరాఫ్ అడ్రెస్‌గా మారుతోంది. తన పరువాలతో గిలిగింతలు పెడుతోంది. కొంచెం లేటుగా వచ్చినా.. ఓ వైపు క్యారెక్టర్ రోల్స్ చేస్తూనే మరోవైపు సోషల్ మీడియాలో మాత్రం గ్లామరస్ పోజిలిస్తూ కవ్విస్తోంది. తాజాగా ఆమె అల్ట్రా స్టైలిష్ లుక్‌లో షార్ట్ టాప్?లో ఫోటోషూట్ చేసి టెంపరేచర్ పెంచేసింది. వివరాల్లోకి వెళితే.. జబర్దస్ షో ద్వారా పాపులర్ అయిన ఈమె.. యాక్టింగ్ అండ్ యాంకరింగ్ స్కిల్స్‌తో తక్కువ సమయంలోనే స్టార్‌గా ఎదిగిపోయింది. కెరీర్ ఆరంభంలో టెలివిజన్ రంగానికే పరిమితమైన ఈమె .. ఆ తర్వాత సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చి దూసుకెళ్తోంది. అయితే ప్రస్తుతం యాంకరింగ్‌ను ఆపేసి.. వరుసగా సినిమాలను చేస్తోంది. కెరీర్‌లో ఫుల్ బిజీగా గడుపుతోంది. రీసెంట్‌గా ఆమె నటించిన 'పెద్ద కాపు', 'ప్రేమ విమానం' చిత్రాలు ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. దీంతో ఆమె సినిమాల్లో నటిస్తూనే ప్రమోషన్స్‌లో పాల్గొంటోంది.



జయాపజయాలతో సంబంధం లేకుండానే ఆమెకు అవకాశాలు కూడా క్యూ కడుతున్నాయి. ఈ ఏడాది 'మైఖేల్', 'రంగమార్తాండ', 'విమానం'తో పాటు 'పెద్ద కాపు', 'ప్రేమ విమానం' చిత్రాలతో అలరించిన ఈమె.. ప్రస్తుతం 'ఫ్లాష్ బ్యాక్', 'పుష్ప 2' చిత్రాల్లో నటిస్తోంది. వీటితో పాటే మరిన్ని చిత్రాల్లో నటంచేలా చర్చలు జరుపుతోంది. సినిమాలతో పాటే సోషల్ మీడియాలో ఫొటోషూట్స్‌ను రచ్చ చేస్తుంటుంది. తనపై విమర్శలు చేసేవారికి గట్టి కౌంటర్లు కూడా ఇస్తుంటుంది. తాజాగా అదిరిపోయే అల్ట్రా స్టైలిష్ ఫొటోషూట్‌లో పాల్గొంది. పింక్ కలర్ షార్ట్ షర్ట్, యాష్ కలర్ ప్యాంట్ ధరించి కూలింగ్ గ్లాస్‌లు పెట్టుకుని స్టైలిష్?గా కూల్ పోజులిచ్చింది. ఎంతో కూల్? అండ్ స్మైల్ లుక్స్ ఇచ్చింది. స్టైలిష్ హ్యాండ్ బ్యాగ్ తగిలించుకుంది. తన పెట్? కూడా కలిసి కొన్ని ఫొటోలు దిగింది. ఒక్కో ఫొటోలో ఒక్కోలా పోజులిచ్చింది. కూర్చొని, నిల్చొని, సైడ్ యాంగిల్‌లో ఫొటోలు దిగింది. మొత్తంగా ఈ పిక్స్ ఎంతో సాలిడ్‌గా ఉన్నాయంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.

## టైగర్ నాగేశ్వరరావుకు ఎలా పడిందో కానీ..!

హీరోయిన్ల సోదరీమణులు తెరకు పరిచయం అవ్వడం రెగ్యులర్ గా చూసేదే. తెలుగు చిత్రసీమకు రాధ- భానుప్రియ - కాజల్- సంజన సహా పలువురి సోదరీమణులు పరిచయం అయ్యారు. ఇప్పుడు కృతి సనోన్ సోదరి నూపుర్ సనోన్ తెలుగు తెరకు పరిచయమవుతోంది. టైగర్ నాగేశ్వరరావు లాంటి భారీ పాన్ ఇండియా సినిమాతో ఈ నార్త్ భామ ఇంట్రో ఇవ్వడం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. నూపూర్ సనన్ అందచందాలకు ఇప్పటికే పరిశ్రమ వర్గాలతో పాటు కామన్ ఆడియెన్ స్పెల్ బౌండ్ అయిపోతున్నారు. అందానికి అందం ఒడ్డు పొడుగు ఉన్న ఈ భామ హాట్ లుక్స్ తో కిల్ చేస్తోంది. తాను తెలుగు తెరకు ఎలా పరిచయమైందో కూడా తాజా ఇంటర్వ్యూలో తెలిపింది ఈ బ్యూటీ. నిజానికి వంశీ సర్ (టైగర్ నాగేశ్వరరావు



దర్శకుడు)ని మొదటిసారి కలిసినప్పుడు.. ఇప్పుడు నన్ను కంట్రోల్ చేయడానికి మీ దగ్గర రిమోట్ ఉందని సరదాగా చెప్పాను. నాలోని మీ పాత్ర భావోద్వేగాలను తదనుగుణంగా సర్దుబాటు చేయండి.. అని చెప్పానని తెలిపారు. అక్టోబర్ 20న టైగర్ నాగేశ్వరరావు విడుదలకు సిద్ధంగా ఉంది. TNR తన తెలుగు అరంగేట్రం మాత్రమే కాదు.. తనకు పాన్ ఇండియా సినిమా అని కూడా నూపూర్ తెలిపింది. ఇది భారతీయ సంకేత భాషతో పాటు ఇతర దక్షిణ భారతీయ భాషలతో పాటు హిందీలో కూడా విడుదలవుతోందని ఆనందంగా చెప్పింది. నూపుర్ 2019లో అక్షయ్ కుమార్ సరసన ఒక మ్యూజిక్ వీడియోలో తొలిసారిగా కనిపించింది. ఆ తర్వాత ఈ మధ్యకాలంలో డిస్నీ ం హాట్‌స్టార్ ఒరిజినల్ కామెడీ షో పాప్ కౌన్ తో పాటు నవాజుద్దీన్ సిద్ధిఖీ సరసన నూరానీ చెహ్రా అనే హిందీ చిత్రంలోనూ నటించింది. ఇప్పటికే చెహ్రా విడుదల కావాల్సి ఉంది.

కానీ అది ఇప్పుడు డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకు వస్తుంది. అంతకుముందే TNR తో గ్రాండ్ గా ఎంట్రీ ఇస్తున్నాను. గొప్ప ప్రొడక్షన్ హౌస్ పెద్ద స్టార్లతో మంచి అవకాశ మిది. నా కోసం గొప్ప కథ, పాత్ర రాసారు. మేకర్స్ సినిమాను మార్కెట్ చేయడంతోపాటు నన్ను బాగా ప్రెజెంట్ చేసారు... అని తెలిపింది.




ఐజ్వాల్: ఈశాన్య రాష్ట్రం మిజోరం అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు తేదీని కేంద్ర ఎన్నికల సంఘం మార్పు చేసింది. తెలంగాణ, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలతోపాటుగా మిజోరంలోనూ డిసెంబర్ 3న (ఆదివారం) ఓట్ల లెక్కింపు చేపట్టాలని ఈసీ షెడ్యూల్ విడుదల చేసిన విషయం తెలిసిందే. అయితే, మిజోరంలో ఆదివారం కాకుండా ఇంకేదైనా రోజు ఓట్ల లెక్కింపు జరపాలని అక్కడి ప్రజల నుంచి పెద్ద ఎత్తున వినతులు వచ్చాయి. దీంతో, వారి విజ్ఞాపనల్ని పరిగణనలోకి తీసుకున్న కేంద్ర ఎన్నికల సంఘం ఓట్ల లెక్కింపు తేదీని డిసెంబర్ 4కు(సోమవారం) మార్పు చేసింది. మిగిలిన నాలుగు రాష్ట్రాల ఓట్ల లెక్కింపు ప్రక్రియలో మాత్రం ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేసింది. మిజోరంలో 40అసెంబ్లీ స్థానాలకు అక్టోబర్ 9న ఒకే విడతలో పోలింగ్ నిర్వహించిన విషయం తెలిసిందే.




బెంగళూరు : గేటెడ్ కమ్యూనిటీల్లోని రహదారులపై బయటి వారు కూడా రాకపోకలు సాగించవచ్చని కర్ణాటక ఉన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. బెంగళూరు ఆనుకొని ఉండే బెళ్లందూరులోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర టవర్స్ గేటెడ్ కమ్యూనిటీలోని రహదారుల మీదుగా.. పక్కనే ఉండే తమ ఇళ్లలోకి వెళ్లేందుకు అనుమతించాలని ఉపకార్ రెసిడెన్సీస్‌కి చెందినవారు గతంలో హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారించిన ఏకసభ్య ధర్మాసనం.. సముదాయంలోని రోడ్లు, ఇతర సదుపాయాలకు స్థానిక సంస్థలు ఆమోదం తెలిపిన అనంతరం అక్కడి నివాసాల యజమానులు, లేఅవుట్ను అభివృద్ధి చేసిన వారికి వాటిపై ఎటువంటి హక్కు ఉండదని గతేడాది నవంబరు 29న తీర్పు ఇచ్చింది. దీన్ని సవాల్ చేస్తూ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర టవర్స్ గేటెడ్ కమ్యూనిటీకి చెందిన ఓ వ్యక్తి హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించారు.

ఇరుపక్షాల వాదనలు విన్న జస్టిస్ ప్రసన్న బాలచంద్ర వరాళె, జస్టిస్ కృష్ణ ఎస్ దీక్షిత్‌ల పీఠం.. గతంలో ఏకసభ్య ధర్మాసనం వెలువరించిన తీర్పును సమర్థించింది. ఒకసారి స్థానిక సంస్థల నుంచి అనుమతులు లభించిన తర్వాత గేటెడ్ కమ్యూనిటీల్లోని రహదారులు, ఇతర సదుపాయాలు కేవలం అక్కడ నివసిస్తున్న వారికి మాత్రమే పరిమితమై ఉండవని మరోసారి స్పష్టం చేసింది.




హైదరాబాద్: హైదరాబాద్‌లోని టీపీసీసీ అధినేత, మల్కాజ్‌గిరి ఎంపీ రేవంత్‌రెడ్డి ఇంటి వద్ద భారీ భద్రత ఏర్పాటు చేశారు. మెజార్టీ ఎగ్జిట్ పోల్స్‌లో కాంగ్రెస్ పార్టీదే అధికారం అని తెలవడంతో రేవంత్‌రెడ్డి ఇంటి వద్ద పోలీసులు అధిక సంఖ్యలో మోహరించారు. గతంలో కంటే ఎక్కువగా పోలీసులను మోహరించారు. పోలింగ్ అంచనాలు కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా వస్తుండడంతో నాయకులు, కార్యకర్తలు రేవంత్‌రెడ్డి ఇంటికి భారీగా తరలివస్తున్నారు. కాంగ్రెస్ తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిస్తే సీఎం అభ్యర్థి రేవంత్‌రెడ్డి అనే ప్రచారం జోరుగా జరుగుతోంది. దీంతో ఆయన నివాసానికి పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలి వచ్చే అవకాశం ఉందని తెలియడంతో ఇంటెలిజెన్స్ వర్గాల సమాచారం ఆధారంగా భద్రత పెంచినట్టు తెలుస్తోంది. మరోవైపు తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం శ్రమించిన, సహకరించిన ప్రతి ఒక్కరికి పేరు పేరునా ధన్యవాదాలు తెలుపుతున్నాంటూ రేవంత్‌రెడ్డి ఎక్స్‌లో ట్వీట్ చేశారు. గడచిన పదేళ్లుగా అడుగడుగునా అణచివేతలు, దాడులు, కేసులకు భయపడకుండా కాంగ్రెస్ పార్టీ చేసిన పోరాటంలో మీరంతా ప్రజల పక్షాన నిటారుగా, నికార్సుగా నిలబడ్డారని కొనియాడారు. మీ కష్టం, శ్రమ వృథా కాలేదని తెలిపారు. తెలంగాణలో ప్రజాస్వామ్య పునరుద్ధరణలో మీ అందరి పాత్ర మరువలేనిదని.. ప్రతి ఒక్కరికి అభినందనలు తెలియజేస్తున్నానని పేర్కొన్నారు.




బ్యూనస్ ఎయిర్స్: వివాదాస్పద స్వామిజీ నిత్యానంద మరోసారి వార్తల్లో నిలిచారు. ఆయన స్థాపించిన యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ కైలాసతో ఒప్పందం చేసుకున్నందుకు పరాగ్వే వ్యవసాయ శాఖలోని కీలక అధికారి తన పదవికి రాజీనామా చేశారు. మరోవైపు ఇదే తరహాలో నిత్యానంద దక్షిణ అమెరికాలోని పలువురు ప్రభుత్వాధికారులను తప్పుదోవపట్టించినట్లు సమాచారం. ఈ ఏడాది మొదట్లో యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ కైలాస ప్రతినిధులు జెనీవాలో నిర్వహించిన ఐరాస సమావేశాల్లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కైలాసతో దౌత్యసంబంధాల ఏర్పాటుకు కృషి చేస్తానని.. అంతర్జాతీయ వేదికలపై కైలాస దేశ సార్వభౌమత్వానికి గుర్తింపు లభించేలా మద్దతు ఇస్తామని పరాగ్వే వ్యవసాయ మంత్రిత్వశాఖలోని ముఖ్య అధికారి అర్నాల్డో చమర్రో ఓ ప్రకటనపై సంతకం చేశారు. దీనిపై పరాగ్వేలో అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. మరోవైపు ఇదో కుంభకోణమని ఆరోపిస్తూ.. నెటిజన్లు సామాజిక మాధ్యమాల్లో తూర్పార పట్టారు. ఈ పరిణామాల నేపథ్యంలో అర్నాల్డో తన పదవికి రాజీనామా చేశారు. అమెరికా, కెనడాకు చెందిన స్థానిక నాయకులతో కూడా కైలాస ప్రతినిధులు ఇదే తరహాలో పలు ఒప్పందాలు చేసుకున్నట్లు సమాచారం.

**కైలాస దేశ 'ప్రధాని'.. వివాదాల స్వామీజీ! :** ఈ ప్రకటన గురించి అర్నాల్డో చమర్రో స్థానిక వార్తా సంస్థతో మాట్లాడుతూ.."యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ కైలాస ఎక్కడుందో నాకు తెలియదు. మౌలిక సదుపాయాలు, నీటి పారుదలకు సంబంధించి పరాగ్వేకు సాయం చేస్తామని కైలాస ప్రతినిధులు ముందుకు రావడంతో నేను ప్రకటన పత్రాలపై సంతకం చేశాను'' అని తెలిపారు. మరోవైపు పరాగ్వేలోని స్థానిక మున్సిపాలిటీలతో చేసుకున్న ఒప్పందాలకు సంబంధించిన ప్రతులను కైలాస సామాజిక మాధ్యమ ఖాతాల్లో ఉంచడంతో దానిపై తీవ్ర దుమారం చెలరేగింది. గతంలో అమెరికాలోని న్యూజెర్సీ రాష్ట్రంలోని నెవార్క్ నగర యంత్రాంగాన్ని కూడా కైలాస ప్రతినిధుల ఇదే తరహాలో మోసం చేశారు. ఈ మేరకు నెవార్క్ నగర యంత్రాంగం ఒక ప్రకటన విడుదల చేసింది. నిత్యానంద భారత్‌లో అత్యాచారం సహా వివిధ ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలోనే ఆయన 2019లో దేశం విడిచి పారిపోయారు. తర్వాత ఈక్వెడార్ సమీపంలోని ఓ ద్వీపంలో ఉన్నట్లు ఇంటర్ పోల్ వర్గాలు తెలిపాయి.

ఆ ద్వీపానికే యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ కైలాస అని పేరు పెట్టి తనని తాను ప్రధానిగా ప్రకటించుకున్నారు. కైలాసకు సొంతంగా డాలర్, రిజర్వ్ బ్యాంకు, జెండా, పాస్‌పోర్టును తీసుకొచ్చారు. అనంతరం కైలాస ప్రతినిధిగా చెబుతూ.. విజయప్రియ నిత్యానంద అనే మహిళ ఈ ఏడాది ఫిబ్రవరిలో జెనీవాలో జరిగిన ఐరాస సమావేశానికి హాజరయ్యారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. నిత్యానందను భారత్ వేధిస్తోందని ఆరోపించారు.

## ఎగ్జిట్ పోల్స్‌తో పరేషాన్ కావొద్దు.. మళ్లీ భారాసదే విజయం: సీఎం కేసీఆర్



హైదరాబాద్: ఎగ్జిట్ పోల్స్‌తో పరేషాన్ కావొద్దని, మళ్లీ భారాసనే విజయం సాధించబోతోందని పార్టీ నేతలతో సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను ఇవాళ పలువురు నేతలు కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫలితాలపై జరుగుతున్న ప్రచారంతో ఆందోళన చెందవద్దని, రాష్ట్రాన్ని పాలించబోయేది భారాసనే అని చెప్పినట్టు సమాచారం.

ఇవాళ, రేపు ఓపిక పడితే.. 3వ తేదీ సంబురాలు చేసుకుందామని పార్టీ నేతలతో వ్యాఖ్యానించినట్టు తెలిసింది. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసిన విషయం తెలిసిందే. 3వ తేదీ ఉదయం 8గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభం కానుంది.

## అజిత్ పవార్‌కు భాజపా సుపారీ.. మహారాష్ట్ర మాజీ హెూంమంత్రి సంచలన ఆరోపణలు



ముంబయి: మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్‌పై, రాష్ట్ర మాజీ హెూం మంత్రి, ఎన్సీపీ సీనియర్ నాయకుడు అనిల్ దేశ్‌ముఖ్ సంచలన ఆరోపణలు చేశారు. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శరద్ పవార్ రాజకీయ జీవితాన్ని అంతం చేసేందుకు అజిత్ పవార్ కు భాజపా సుపారీ ఇచ్చిందని ఆరోపించారు. ఇందులో భాగంగానే భోపాల్‌లో ప్రధాని మోదీ ప్రసంగం తర్వాత అజిత్ పవార్, ఎనిమిది మంది ఎన్సీపీ ఎమ్మెల్యేలు భాజపా–శివసేన ప్రభుత్వంలో చేరారని తెలిపారు. "ఆయన (అజిత్ పవార్‌ను ఉద్దేశించి) ఎందుకు వేరే మార్గాన్ని ఎంచుకున్నారనేది అందరికీ తెలుసు. నాకు ఎదురైన ఇబ్బందుల్ని ఎదుర్కొనేందుకు ఎన్సీపీ సీనియర్ నాయకులు సిద్ధంగా లేరు. ఎన్సీపీ నాయకులు రూ. 70 వేల కోట్లు అవినీతికి పాల్పడ్డారని భోపాల్‌లో ప్రధాని మోదీ ఆరోపించిన మరుసటి రోజే వారంతా భాజపా–శివసేన ప్రభుత్వంతో చేతులు కలిపారు. శరద్ పవార్ రాజకీయ జీవితాన్ని అంతం చేసేందుకు అజిత్ పవార్‌కు భాజపా సుపారీ ఇచ్చింది" అని అనిల్ దేశ్‌ముఖ్ ఆరోపించారు. అజిత్ పవార్‌ను ఆయన అనుచరులు ముఖ్యమంత్రిగా చూడాలనుకుంటున్నారా? అన్న ప్రశ్నకు.. రాష్ట్రంలో అధికార భాగస్వాములు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో తనకు తెలియదని బదులిచ్చారు. కానీ, భాజపా–శివసేన ప్రభుత్వంలో ముఖ్య విషయాల్లో నిర్ణయం తీసుకునే విషయంలో అజిత్ పవార్‌ను పక్కన పెట్టారని చెప్పారు. ఈ ఏడాది జులై 2న అజిత్ పవార్, ఎనిమిది మంది ఎన్సీపీ ఎమ్మెల్యేలతో కలిసి భాజపా–శివసేన ప్రభుత్వంతో చేతులు కలిపారు. అనంతరం ఆయన ఉప ముఖ్యమంత్రిగా, పలువురు ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ పరిమాణం మహారాష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారింది. అప్పటి నుంచి శరద్ పవార్–అజిత్ పవార్ మధ్య పలుమార్లు భేటీలు జరిగినప్పటికీ.. ఏకాభిప్రాయం కుదరలేదు.

## తెలంగాణలో రీపోలింగ్‌కు అవకాశం లేదు: సీఈవో వికాస్‌రాజ్




హైదరాబాద్: తెలంగాణలో 2018 ఎన్నికలతో పోలిస్తే ఈసారి పోలింగ్ దాదాపు 3 శాతం తగ్గిందని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) వికాస్‌రాజ్ తెలిపారు. ఈ ఎన్నికల్లో ఇప్పటివరకు అందిన వివరాల ప్రకారం 71.07 శాతం పోలింగ్ నమోదైందని చెప్పారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

**49 కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు :** "పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా పూర్తయింది. పరిశీలకుల సమక్షంలో పోలైన ఓట్ల వివరాల పరిశీలన కొనసాగుతోంది. అది పూర్తవగానే పోలింగ్ శాతంపై పూర్తి స్పష్టత వస్తుంది. 79 నియోజకవర్గాల్లో 75 శాతానికి పైగా పోలింగ్ జరిగింది. డిసెంబర్ 3న జరిగే ఓట్ల లెక్కింపు కోసం ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నాం. మొత్తం 49 కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు ఉంటుంది. రాష్ట్రంలో రీపోలింగ్‌కు అవకాశం లేదు. ఇప్పటివరకు అందిన వివరాల మేరకు రాష్ట్రంలో అత్యధికంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో 90.03%, అత్యల్పంగా హైదరాబాద్‌లో 46.56% పోలింగ్ నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా 16,005 మంది వృద్ధులు, 9,459 మంది దివ్యాంగులు హెూం ఓటింగ్ ఉపయోగించుకున్నారు. 1,80,000 మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నారు. థర్డ్ జెండర్ కూడా ఎక్కువ సంఖ్యలో ఓటు వేశారు. 27,094 కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్, 7,591 కేంద్రాల వెలుపల సీసీ టీవీ సదుపాయం కల్పించాం.

**13,000 కేసులు నమోదు :** లెక్కింపు కేంద్రాల వద్ద మూడంచెల భద్రత ఉంటుంది. 40 కంపెనీల బలగాలతో భద్రత కల్పిస్తున్నాం. స్ట్రాంగ్ రూంల వద్ద సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేశాం. లెక్కింపు కేంద్రాల్లో 1,766 లెక్కింపు టేబుళ్లు, 131 పోస్టల్ బ్యాలెట్ టేబుళు ఉంటాయి. ఆరు నియోజకవర్గాల్లో 500కు పైగా పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. అక్కడ 28 టేబుళ్లు ఉంటాయి. కౌంటింగ్ రోజు ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రారంభమవుతుంది. 8.30 గంటల నుంచి ఈవీఎంల లెక్కింపు మొదలవుతుంది. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఎక్కువగా ఉంటే పోస్టల్ బ్యాలెట్, ఈవీఎం లెక్కింపు సమాంతరంగా కొనసాగుతుంది. ప్రతి టేబుల్‌పై మైక్రో అబ్జర్వర్, ఒక కౌంటింగ్ సూపర్ వైజర్, ఇద్దరు అసిస్టెంట్లు ఉంటారు. ప్రలోభాలు, ఉల్లంఘనలకు సంబంధించి గతం కంటే ఈసారి ఎక్కువ కేసులు నమోదయ్యాయి. 2018లో 2,400 కేసులు ఉంటే.. ఇప్పుడు 13,000 కేసులు నమోదయ్యాయి. కొందరు మంత్రులపై కూడా పోలీసులు కేసులు నమోదు చేశారు" అని వికాస్‌రాజ్ తెలిపారు.

## కాంట్రాక్టర్లకు వేల కోట్ల చెల్లింపులకు బీఆర్ఎస్ ప్లాన్: భట్టి విక్రమార్క

హైదరాబాద్: తెలంగాణ ఎన్నికలపై ఎగ్జిట్‌పోల్స్ ఆసక్తికర ఫలితాలను వెల్లడించాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రానున్నట్టు ఎక్కువ సంఖ్యలో పోల్స్ సంస్థలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క కీలక వ్యాఖ్యలు చేశారు. ఇక, తాజాగా భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ గెలుస్తుందని ఎగ్జిట్‌పోల్స్ తేల్చాయి. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌ను దీవించారు. డిసెంబర్ మూడు తర్వాత కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది. అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తాం. పదేళ్లుగా బీఆర్ఎస్ నేతలు భూదోపిడీలకు పాల్పడ్డారు. లక్షల కోట్ల విలువైన భూములు ప్రజలకు, ప్రభుత్వానికి చెందకుండా పోయే ప్రమాదం ఏర్పడింది. ధరణిని అడ్డుపెట్టుకుని హైదరాబాద్ పరిధిలో వేలాది ఎకరాలు దోచుకున్నారు. అధికారులు బీఆర్ఎస్ ప్రభుత్వ ఒత్తిళ్లకు తలొగ్గి అడ్డగోలు పనులు చేయవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం. రెవెన్యూ వ్యవస్థను అప్రమత్తం చేస్తున్నాం. కాంట్రాక్టర్లకు వేల కోట్ల చెల్లింపులు ఈ రెండు, మూడు రోజుల్లో చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఒక ప్రభుత్వం నుండి మరొక ప్రభుత్వం మారుతున్న క్రమంలో ఇష్టరాజ్య%శీ%గా వ్యవహరించకుండా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తాం. రాష్ట్రంలో ఎన్నికల కౌంటింగ్ సమయంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు అప్రమతంగా ఉండాలి. తెలంగాణలో గత ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో ధర్మపురి, హుజూర్ నగర్, మంచిర్యాల, ఇబ్రహీంపట్నం, తుంగతుర్తిలో ఇబ్బందులు నెలకొన్నాయి.



ప్రస్తుతం కోర్టులలో కేసులు కూడా ఇంకా నడుస్తున్నాయి. కాంగ్రెస్ కార్యకర్తలు కౌంటింగ్ పూర్తయ్యేవరకు అప్రమత్తంగా ఉండాలి. ప్రజలు మార్పు కోసం తీసుకున్న నిర్ణయాన్ని కాపాడుకోవాల్సిన అవసరం కాంగ్రెస్ పార్టీకి ఉంది. అటు టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి కూడా కేసీఆర్‌పై సంచలన ఆరోపణలు చేశారు. తాజాగా రేవంత్ మాట్లాడుతూ.. కేసీఆర్ ఓటమి భయంతో రైతుబంధు నిధులను ఇతర మార్గాలకు మళ్లిస్తున్నారు. కమీషన్ల కోసం రైతుబంధు నిధులు కాంట్రాక్టర్లకు ఇస్తున్నారు. హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న అసైన్డ్ మెంట్ భూములను ఇతరుల పేర్ల మీద రిజిస్ట్రేషన్ చేసే పక్రియ జరుగుతోంది. ప్రభుత్వ అన్ని ట్రాన్సాక్ష?న్స్‌పై నిఘా పెట్టాలని ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేస్తాం. ప్రభుత్వ ట్రాన్సాక్షన్‌పై విజిలెన్స్ నిఘా పెట్టాలని ఇటు హైదరాబాద్‌లో అటు ఢిల్లీలో ఎన్నికల సంఘం, ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

## గవర్నర్‌ను కలిసిన కాంగ్రెస్ నేతలు.. ప్రభుత్వ తీరుపై ఫిర్యాదు

విజయవాడ: రాష్ట్రంలో కరువు కాటకాలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు (%+అంబస్త్రబ =బంతీఖుతీఖుయబ%) ఆరోపించారు. రాజ్‌భవన్‌లో గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను ఏపీ కాంగ్రెస్ నేతలు కలిశారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులు, ప్రభుత్వ వైఫల్యాలపై గవర్నర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం గిడుగు రుద్రరాజు మీడియాతో మాట్లాడారు. "687 మండలాల్లో కరువు ఉందని నివేదికలు చెబుతున్నా.. ప్రభుత్వం కొన్ని ప్రాంతాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించింది. ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో కరువు పరిస్థితులు ఎక్కువగా ఉన్నాయి. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వం స్పందించడం లేదు. పల్నాడు, కర్నూలులో రైతులు ఆత్మహత్య చేసుకున్న ప్రభుత్వం పట్టించుకోలేదు. ఆత్మహత్యలు చేసుకున్న రైతుల కుటుంబాలను రూ.20 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం. కరువు కారణంగా నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేలు ఇవ్వాలి. కౌలు రైతులను కూడా ప్రభుత్వం ఆదుకోవాలి. ఉపాధి లేక సొంతిల్లు నుంచి వలస పోతున్నారు. నీళ్ల సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలి. విభజన హామీల విషయంలో షెడ్యూల్ ప్రకారం నీటి కేటాయింపులు చేపట్టాలి. పోలింగ్ జరిగే రోజున ఇటువంటి గొడవలు చేయడం దురదృష్టకరం. పోలింగ్ రోజున డైవర్ట్ చేయడానికి నీటి పంపకాల పేరుతో ఏమి చేసినా ప్రజల చూస్తూ ఊరుకోరు." అని తెలిపారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com